PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 260 | విజయవాడ, బుధవారం 23 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 23 April 2025 | Rs

పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎర్ర జెండానే ప్రత్యామ్నాయం

- లెనిన్ జయంతి సభలో వక్తలు

8



జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడి

28 మంది పర్యాటకులు మృతి • మరో 12 మందికి తీవ్ర గాయాలు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించేశామంటూ కేంద్రంలోని మోడీ సర్కార్ గొప్పలు చెప్పుకుంటున్న నేపథ్యంలో ఉగ్రవాదులు పెట్రేగిపోయారు. కాశ్మీరంలో శాంతి సమీరాలు వీయడం లేదని, అక్కడి ప్రజానీకం ఇంకా తుపాకీ నీడనే బిక్కుబిక్కుమంటున్నారని స్పష్టమైంది. అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంకు సమీపంలోని బైసరన్ వ్యాలీ ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో 28 మంది మరణించారు. మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు చెప్పారు. బాధితులంతా కర్ణాటక, ఒడిషా రాష్ట్రానికి చెందినవారిగా గుర్తించారు. క్షతగాత్రుల్ని దక్షిణ కాశ్మీర్‌లోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. అనంత్‌నాగ్ ఆసుపత్రికి నలుగుర్ని తరలించగా, వీరిలో ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో శ్రీనగర్‌కు తరలించారు. ఇటీవల కాలంలో జమ్మూకాశ్మీర్‌లో ఇదే అతిపెద్ద దాడి. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్‌లోని గడ్డి మైదానాలు పర్యాటకంగా ప్రసిద్ధి చెందాయి. ఇక్కడ పర్యాటకుల్ని కేవలం నడవడానికి, లేదా రైడింగ్‌కు మాత్రమే అనుమతిస్తారు. మంగళవారం మైదానంలో ఉన్న పర్యాటకులపై మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో సమీప అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఉగ్రవాదుల గుంపు పర్యాటకులపై విచక్షణారాహిత్యంగా కాల్పులకు తెగబడ్డారు. సైనికుల దుస్తుల్లో వచ్చిన సాయుధులు ఒక్కసారిగా కాల్పులు జరపడంతో పర్యాటకులకు తప్పించుకునే అవకాశం కూడా కలగలేదు. ప్రత్యక్షసాక్షుల ప్రకారం.. పర్యాటకులపై అత్యంత సమీపం నుంచి ఉగ్ర వాదులు కాల్పులు జరిపారు. దీంతో అనేక మందికి గాయాలయ్యాయి. బైసరన్‌లో కాల్పుల శబ్దం మిగతా 7లో




అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చంద్రబాబు

ప్రాజెక్టులకు సాయపడండి

- కేంద్ర మంత్రులకు సిఎం చంద్రబాబు విజ్ఞప్తి
- రాజ్యసభ సీటు బిజెపికి కేటాయించేందుకు అంగీకారం!

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం రాత్రికి ఢిల్లీ చేరుకున్న ఆయన మంగళవారం పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. హోం మంత్రి అమిత్ షా, వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్, జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్, న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తదితరులు సిఎం కలిసిన వారిలో ఉన్నారు. అమిత్‌షాతో జరిపిన భేటీలో రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన ఏకైక రాజ్యసభ స్థానాన్ని బిజెపికి కేటాయించడానికి చంద్రబాబు అంగీకరించి నట్లు సమాచారం. వైసిపి తరపున రాజ్యసభకు ఎన్నికైన విజయసాయిరెడ్డి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి ఎన్నిక జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ స్థానం నుండి పోటీకి ఇతర రాష్ట్రాలకు చెందిన ఒకరిద్దరు పేర్లను బిజెపి అధినాయకత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్షనేతల అరెస్టులు, రెండవ తేదీన జరగనున్న ప్రధాని పర్యటన తదితర అంశాలు కూడా అమిత్‌షాతో భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. కేంద్ర జల్‌శక్తి మంత్రితో జరిపిన భేటీలో పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సాయం చేయాలని సిఎం కోరారు. కేంద్ర అటల్ భూజల్ యోజన్ కార్యక్రమంపై చర్చించారు. జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్, పిఎంకెఎస్‌వై-సిఎడిడబ్ల్యుఎం, నదుల అనుసంధానం వంటి అంశాలు కూడా ఇరువురు నేతల మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో భేటీ జరిగిన భేటీలో అమెరికా టారిఫ్‌ల నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్వా రంగంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ విషయంలో అమెరికాతో చర్చించి ఆక్వా రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్

న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌తో సిఎం సమావేశం అయ్యారు. కర్నూలులో మిగతా 7లో

సివిల్స్‌లో సత్తా చాటిన మహిళలు

- టాప్ 5లో ముగ్గురు, టాప్ 25లో 11 మంది మగువలే
- ఫలితాలు ప్రకటించిన యుపిపిఎస్‌సి

7

దళితుల సాంఘిక బహిష్కరణ

- పోతురాజుపేటలో వివక్ష
- పట్టించుకోని రెవిన్యూ అధికారులు
- అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ స్థలం ఆక్రమణ

3

సినీనటి జత్వానీ కేసులో ...

పిఎస్‌ఆర్ ఆంజనేయులు అరెస్ట్

- 7గంటల పాటు విచారణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో




ముంబాయికి చెందిన సినీనటి జత్వానీ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పిఎస్‌ఆర్ ఆంజనేయులును సిఐడి అధికారులు హైదరాబాద్‌లో మంగళవారం ఉదయం అరెస్ట్ చేశారు. వేధింపులకు సంబంధించి జత్వాని ఫిర్యాదు చేసిన కేసులో పిఎస్‌ఆర్ ఆంజనేయులు రెండవ నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ కేసులోనే సస్పెన్షన్‌కు గురై ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న ఆయన్ను అరెస్టు చేసిన సిఐడి పోలీసులు విచారణ కోసం విజయవాడకు తీసుకువచ్చారు. హైదరాబాద్ నుండి నేరుగా విజయవాడలోని సిఐడి కార్యాలయానికి ఆయన్ను తీసుకువచ్చిన పోలీసులు, కొద్దిసేపు విశ్రాంతి ఇచ్చి, ఆ తరువాత విచారణ ప్రక్రియను చేపట్టారు. మంగళవారం నాడు ఆయన్ను దాదాపుగా ఏడు గంటల పాటు వివిధ అంశాలపై ప్రశ్నించారు. జత్వానీని, ఆమె కుటుంబ సభ్యులను వేధించడం వెనుక ఎవరున్నారు? అప్పటి విజయవాడ పోలీస్ కమిషనరు కాంతిరాణాటాటా, మరో ఐపిఎస్ అధికారి విశాల్‌గున్నీల పాత్ర ఏమిటి? ఎవరి ఆదేశాల మేరకు ఇంటిలిజెన్స్ అధికారిగా ఉండి ఈ కేసులో జోక్యం చేసుకున్నారు అన్న అంశాలపై విచారణాధికారులు దృష్టి స్టారించారు. మద్యం పాలసీ, పంపకాలు, సిఎం చంద్రబాబునాయుడును మిగతా 7లో



కూల్చిన ఇళ్లను నెల రోజుల్లో పునర్నిర్మించాలి

- లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం
- ఉండి నియోజకవర్గంలో విధ్వంస, అరాచక పాలన
- పాలకోడేరు బాధితులకు వి.శ్రీనివాసరావు పరామర్శ

2



కూల్చిన ఇళ్లను నెల రోజుల్లో పునర్నిర్మించాలి

- లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం
- ఉండి నియోజకవర్గంలో విధ్వంస, అరాచక పాలన
- డిప్యూటీ స్పీకర్ పదవికి రఘురామకృష్ణరాజు అనర్హుడు: వి శ్రీనివాసరావు
- పాలకోడేరు బాధితులకు సిపిఎం నేతల పరామర్శ



కూలగొట్టిన ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నేతలు

ప్రజాశక్తి- భీమవరం

కూల్చేసిన పేదల ఇళ్లను నెల రోజుల్లో పునర్నిర్మించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఉండి నియోజకవర్గంలో విధ్వంస, అరాచక పాలన రాజ్యమేలుతోందని, మూడు నెల కాలంలో సుమారు వెయ్యి ఇళ్లు కూల్చేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. పేదలపై యుద్ధం చేస్తోన్న డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆ పదవికి అనర్హుడని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం పాలకోడేరులోని ఎఎస్ఆర్ నగర్‌ను సిపిఎం రాష్ట్ర నేతలు బి.బలరాం, మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణతో కలిసి శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. అధికారులు ఇటీవల కూల్చేసిన ఇళ్లను పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు తమ కష్టాలు చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. పడగొట్టిన ప్రతి ఇంటినీ, భూస్వాములు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని, ప్రభుత్వ సర్వే రాళ్లను నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఎస్ఆర్ నగర్‌లో బాధితులతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం జరిగిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించారు. ఈ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎఎస్ఆర్ నగర్‌లోని ఇళ్ల శిథిలాలను చూస్తుంటే హృదయం చలించిపోతోందన్నారు. చంద్రబాబు పుట్టిన రోజున జరిగిన ఈ ఘటనను ముఖ్యమంత్రి బహుమతిగా స్వీకరిస్తార్నా? తిరస్కరిస్తారా? అని ప్రశ్నించారు. స్థానిక ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు చేసిన పాపంలో కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు అధికారులందరూ భాగస్తులేనన్నారు. ప్రభుత్వ భూముల్లో పేదలు ఇళ్లు వేసుకుంటే తొలగించే అధికారం ఎవరికీ లేదన్నారు. మహిళలను మగ పోలీసులు కొడతారా, సిగ్గుందా అని ప్రశ్నించారు. పాలకోడేరు పోలీసులపై మానవ హక్కుల సంఘాలకు నివేదిస్తామని హెచ్చరించారు. పునరావాసం కల్పించకుండా ఇళ్లు తొలగించడం నేరమన్నారు. కాలుష్యం పేరుతో ఇళ్లను తొలగిస్తున్నారని, ఆక్వా ప్లాంట్లు, యనమదుర్రు డ్రెయిన్ కాలుష్యం మీకు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. ఐక్యంగా పోరాడదామని, మీకు ఎర్రజెండా అండగా నిలుస్తుందని బాధితులకు ధైర్యం చెప్పారు. బ్యాంకులకు వందల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి డిఫాల్ట్ అయిన, సిబిఐ కేసులున్న రఘురామకృష్ణరాజు ఇప్పుడు నీతులు చెబుతున్నారని వి.శ్రీనివాసరావు విమర్శించారు. 2019 నుంచి ఎన్ని కేసులున్నాయో వాటన్నింటికీ సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎన్నికల అఫిడవిట్లోనే కేసుల భాగోతం ఉందన్నారు. హిందూ భారత్ విద్యుత్ కంపెనీలో నష్టమొచ్చిందనే పేరుతో రూ.600 కోట్లు ఎగ్గొట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి దమ్ముంటే రఘురామకృష్ణరాజు అవినీతిని, ఎగ్గొట్టిన బకాయిలను బయట పెట్టాలన్నారు. ఉండి నియోజకవర్గంలో ఇంత విధ్వంసం జరుగుతుంటే సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లకు కన్పించడం లేదా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో డబ్బులు పంచానని రఘురామకృష్ణరాజు బహిరంగంగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. డిప్యూటీ స్పీకర్ అరాచకాలను కట్టడి చేయకపోతే టిడిపి కూటమి ప్రభుత్వం రాబోయే కాలంలో ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు.

భూస్వాముల ఆక్రమణలోని భూమిని పేదలకు పంచుతాం

ఎఎస్ఆర్ నగర్‌లో భూస్వాముల కబ్జాలో ఉన్న భూమిని ప్రభుత్వం నెల రోజుల్లో స్వాధీనం చేసుకోని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తామే ఆ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామని హెచ్చరించారు. సుమారు రెండు ఎకరాల్లో సెంటు, సెంటున్నర భూమిలో నిరుపేదలు ఇళ్లు నిర్మించుకొని 40 ఏళ్ల నుంచి జీవిస్తుంటే కాలువ కలుషితం పేరుతో వాటిని కూల్చారని, భూస్వాముల కబ్జాలో ఉన్న సుమారు 13 ఎకరాల భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. దడాల సుబ్బారావు మాట్లాడుతూ పేదల గుడిసెలు మాత్రమే అధికారులకు, ఎంఎల్ఎకు కనిపించాయా? భూస్వాముల కబ్జాలోని భూములు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4... ఉండి నియోజకవర్గంలో రివర్స్‌లో అమలవుతోందన్నారు. సంపన్నుల సహకారంతో పేదలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చెబుతుంటుంటే, ఇక్కడ మాత్రం పేదలను కొట్టి సంపన్నులకు ఆస్తులను కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గిరిజన స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిఓ నెంబరు 3పై ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి గిరిజన స్పెషల్ డిఎస్‌సికి వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెగా డిఎస్‌సి పూర్తయ్యాక జిఓ నెంబరు 3పై ఆలోచిస్తామని మంత్రి సంధ్యారాణి చెప్పడం ఆదివాసీ యువతను నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. 30 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే మెగా డిఎస్‌సి పేరుతో 16,344 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశారని పేర్కొన్నారు. ఇందులో మన్యం, అల్లూరి రెండు జిల్లాల్లో 889 పోస్టులు ఉంటే గిరిజనులకు దక్కేవి కేవలం 45 పోస్టులేనని పేర్కొన్నారు. 1/70 చట్టం పరిధిలో నోటిపై ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, ఉద్యోగాల్లో 100 శాతం గిరిజనులకే ఇవ్వాలని, దానికోసమే గతంలో జిఓ నెంబరు 3 అమలు చేశారని తెలిపారు. దానిని కోర్టు రద్దు చేశాక, ఐదేళ్ల నుండి ఆందోళనలు చేస్తున్నా ఇప్పటికీ పునరుద్ధరించలేదని, ఎన్నికల్లో చంద్రబాబు చేసిన వాగ్దానానికి అతీగతి లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని, మెగా డిఎస్‌సికి ముందే ఎస్‌సి వర్గీకరణకు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి అమలు చేస్తున్నట్లుగానే జిఓ నెంబరు 3పైనా ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని కోరారు. గిరిజన యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఆదివాసీ యువత, ఉపాధి అభివృద్ధిపై ఏ మాత్రమూ చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అభ్యర్థుల అర్హతల్లో మార్పులు చేయాలి

మెగా డిఎస్‌సికి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లో అభ్యర్థుల అభ్యర్థన మేరకు వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కోరారు. గతంలో అనేకసార్లు నిరుద్యోగులు ఆందోళనలూ చేశారని, టిడిపి కూడా వీటిని బలపర్చిందని తెలిపారు. వాటిని పరిగణనలోకి తీసుకుని వయో పరిమితి సడలించాలని కోరారు. బిపిఇడి చదివి మెమోలు రాని వారికి కూడా గతంలో మాదిరి అవకాశం కల్పించాలని, లైబ్రేరియన్ పోస్టులను డిఎస్‌సిలో కలిపి లేదా ప్రత్యేక నోటిఫికేషనైనా వెంటనే విడుదల చేయాలని కోరారు. సిలబస్ విస్తృత దృష్ట్యా పరీక్ష 45 రోజులకు కాకుండా 90 రోజులు సమయం ఇవ్వాలని, డిగ్రీలో అభ్యర్థులకు కనీస మార్కులు ఒసిలకు 50 శాతం, బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు 45 శాతం ఉండాలన్న నూతన నిబంధనలు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల విజ్ఞప్తులపై పరిశీలన చేసి డిఎస్‌సి ప్రక్రియ పూర్తి చేయాలని శ్రీనివాసరావు కోరారు.

సివిల్స్‌లో సత్తా చాటిన సిక్కోలువాసి

- వెంకటేష్‌కు 15వ ర్యాంకు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



సివిల్స్ ఫలితాల్లో సిక్కోలు వాసి సత్తా చాటారు. యుపిఎస్‌సి మంగళవారం వెలువరించిన సివిల్స్ ఫలితాల్లో జలుమూరు మండలం అల్లాడపేటకు చెందిన బాన్న వెంకటేష్ 15వ ర్యాంకు సాధించారు. 2023 సివిల్స్ ఫలితాల్లో ఆయన 467 ర్యాంకు సాధించి ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఐఎఎస్ సాధించాలన్న పట్టుదలతో మూడోసారి సివిల్స్‌కు సాధన సాగించి దాన్ని సాధించారు. వెంకటేష్ తండ్రి చంద్రరావు ధాన్యం వ్యాపారి. తల్లి రోహిణి గృహిణి. వెంకటేష్ ప్రాథమిక విద్య అల్లాడపేటలోనే సాగింది. శ్రీకాకుళం మండలం మునసబుపేటలోని గురజాడ విద్యా సంస్థల్లో పదో తరగతి చదివారు. విశాఖలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ అభ్యసించారు. 2019లో తమిళనాడులోని తిరుచినాపల్లి ఎన్ఐటి పూర్తి చేశారు. తర్వాత తమిళనాడులోని క్వాల్ కంపెనీలో ఇంజనీర్‌గా రెండేళ్లపాటు పనిచేశారు. వెంకటేష్ జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు అభినందిస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెంకటేష్‌కు ఫోన్ చేసి అభినందించారు.

గ్రామ స్థాయిలో 'ఆపదమిత్ర'

- వడగాడ్పులతో మరణించిన వారికి రూ.4 లక్షల పరిహారం
- హోంశాఖ మంత్రి అనిత



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వడగాడ్పుల వల్ల మరణాలు లేకుండా అధికార యంత్రాంగం చూడాలని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రమాదాలు సంభవించినప్పుడు గోల్డెన్ అవర్‌లో వీలైనన్ని ప్రాణాలు కాపాడాలని అధికారులకు సూచించారు. గ్రామస్థాయిలో 'ఆపద మిత్ర'లను సంసిద్ధంగా ఉంచాలని ఎస్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక విభాగాన్ని ఆమె ఆదేశించారు. ఆపద మిత్రలకు శిక్షణ ఇచ్చి సిపిఆర్ మెలకువలు నేర్పడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో మంగళవారం అధికారులతో వడగాడ్పులు, రాబోయే వర్షాకాలానికి సంసిద్ధతపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వాతావరణ మార్పులకు తగ్గట్లు అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని, ప్రణాళికతో సమయం నిర్దేశించుకుని ముందుకెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో వడగాడ్పులు పెరిగే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. వడగాడ్పుల వల్ల మరణించిన వారికి రూ.4 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. ముందస్తు వర్షాలు వస్తే జలవనరులశాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత ప్రభుత్వం డ్రెయినేజీ వ్యవస్థ, వంతెనలు, ఇరిగేషన్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టకపోవడమే విపత్తులకు కారణమని పేర్కొన్నారు. అలాగే ఫైర్, ఎస్‌డిఆర్ఎఫ్ విభాగాలకు ఆర్థికసాయం పెంపుపై చర్చించారు.

రాష్ట్ర వ్యాప్తంగా గతేడాది నంద్యాలలోని గోస్పాడులో అత్యధికంగా 47.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని, ఈ ఏడాది ఏప్రిల్‌లో పల్నాడు జిల్లా, నరసరావుపేటలో 43.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. 2014, 15, 16 సంవత్సరాల్లో అత్యధికంగా 49.1, 50.3, 48.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. తాగునీటి అవసరాలపై ఆరా తీశారు. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉన్నామని, 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్తున్నట్లు మంత్రికి సిడిఎంఎ డైరెక్టర్ సంపత్ వివరించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీటి నిల్వ చేసినట్లు, 92 మండలాలను ముందస్తుగా గుర్తించి ఆ ప్రాంత ప్రజలకు నీటి కష్టాలు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పేర్కొన్నారు. వడగాడ్పుల ద్వారా వడదెబ్బ బారిన పడినవారి చికిత్స కోసం 5,145 పడకలు, 768 అంబులెన్స్‌లను సిద్ధం చేయడంతో పాటు వైద్యులకు శిక్షణ ఇచ్చి అప్రమత్తంగా ఉంచినట్లు వైద్యారోగ్యశాఖాధికారులు వివరించారు. విపత్తు నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ.. సచివాలయం, వార్డు సచివాలయం, ఆశా వర్కర్లు, ఎఎన్ఎమ్‌లను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో విపత్తు నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి జయలక్ష్మి, కార్మికశాఖ అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (సిడిఎంఎ) పి సంపత్, అగ్నిమాపక సంస్థ ఆర్ఎఫ్ఒ జిలాని, ఎపిఎస్‌డిఆర్ఎఫ్ ఐజి రాజకుమారి, ఎన్‌టిఆర్ కమిషనరేట్ డిసిపి కెజివి సరిత, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఇడి నాగరాజు పాల్గొన్నారు.

28న చలో గుంటూరు

- ఎపి కోకో రైతుసంఘ రాష్ట్ర కమిటీ నిర్ణయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ధరల తగ్గుదలతో కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలపై ఈ నెల 28న చలో గుంటూరు కార్యక్రమం చేపట్టి ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించాలని నిర్ణయించింది. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర ఇవ్వాలని సమావేశం డిమాండ్ చేసింది. ఏలూరులోని అన్నే భవనంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోకో గింజల కొనుగోలు, ధర సమస్యపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ....కోకో రైతు సంఘం ప్రతినిధులు, ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, కోకో గింజలు కొనుగోలు కంపెనీలతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సమక్షంలో ఈ నెల మూడున జరిగిన సమావేశ నిర్ణయం మేరకు ఈ నెల ఏడున కోకో గింజల ధరల ఒప్పంద ప్రకటన చేయాల్సి ఉందన్నారు. 15 రోజులు గడిచినా ప్రకటన చేయకపోవడంతో కంపెనీల మోసాలకు గురై కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలకు రూ.750కు పైగా ధర ఉందన్నారు. నిన్నటి వరకు మోండలీజ్ కంపెనీ ఒక కిలోకు రూ.550 ధర ఇవ్వగా ప్రస్తుతం రూ.50 తగ్గించిందని తెలిపారు. ఇతర కంపెనీలు అదే బాటలో కొనుగోలు ధరలు తగ్గిస్తున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. చలో గుంటూరుకు కోకో రైతులందరూ తరలిరావాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, బోళ్ల వెంకట సుబ్బారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుది బండి వీరారెడ్డి, నాయకులు పి.త్రివిక్రమ రావు, యలమాటి విశ్వేశ్వరరావు, జె.ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సస్పెన్షన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను పార్టీ నుంచి వైసిపి అధిష్టానం మంగళవారం సస్పెండ్ చేసింది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘణలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణా కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్రకార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

డిఎస్‌సి అర్హతలో సడలింపులివ్వండి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపి మూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిగ్రీలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు 40 శాతం, ఒసిలు 45 శాతం మార్కులతో ఉత్తీర్ణతలు సాధించినా అర్హతలు కల్పించే విధంగా నోటిఫికేషన్‌ను సవరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌కు మంగళవారం లేఖ రాశారు. నోటిఫికేషన్‌లో ఒసిలు 50 శాతం, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు 45 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలని నిబంధనను విధించారని పేర్కొన్నారు. అయితే, బిఇడి, బిపిఇడి అభ్యర్థులు వృత్తి విద్యా కోర్సులు చేయడానికి 40 శాతం మార్కులకే అనుమతి ఉందని తెలిపారు. ఎంతో మంది అభ్యర్థులు 40 నుంచి 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు బిఇడి, బిపిఇడి చేశారని, వీరంతా గత 7 నుంచి 8 ఏళ్లుగా డిఎస్‌సి నోటిఫికేషన్ గురించి వేచి చూస్తున్నట్లు చెప్పారు. వారిలో నూటికి 99 శాతం వేరే ఏ వృత్తి చేపట్టలేక, వివాహాలు కూడా చేసుకోకుండా కేవలం డిఎస్‌సి మీద ఆశతో ఉన్నారని తెలిపారు. బిఇడి, బిపిఇడి చేసేటప్పుడు లేని 45 శాతం నిబంధన, ఉద్యోగం పొందేందుకు రాసే పరీక్షలో వర్తింపజేయడం సరికాదన్నారు.

ప్రయివేటుకు ఎత్తిపోతల పథకాలు

- తారకరామా తీర్థసాగర్‌ను పూర్తి చేస్తాం
- జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-గుర్ల (విజయనగరంజిల్లా)/ శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా ఎత్తిపోతల పథకాలను ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఆయన మంగళవారం పర్యటించి నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1040 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు ఉండగా అందులో గత ఐదేళ్ల కాలంలో 450 వరకు మూతపడ్డాయని తెలిపారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణ, మరమ్మతులకు ప్రభుత్వమే నిధులు ఇచ్చి పదేళ్లపాటు ఏజెన్సీలకు అప్పగించేందుకు టెండర్ల ఖరారు తుది దశలో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రారంభం కాని, 25 శాతంలోపు జరిగిన పనులను రద్దు చేయాలని నిర్ణయించినా.. ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టులకు దాని నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆయన టెక్కలిలోని మదనగోపాలసాగరం రిజర్వాయర్‌ను పరిశీలించారు. విజయనగరం జిల్లా గుర్ల మండలం ఆనందపురం వద్ద నిర్మాణంలో ఉన్న తారకరామా తీర్థసాగర్ రిజర్వాయర్ ప్రాజెక్టు బ్యారేజీ పనులను మంత్రి నిమ్మల పరిశీలించారు. ముందుగా ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను, ప్రాజెక్టు మ్యాపులను తిలకించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారకరామా తీర్థసాగర్ రిజర్వాయర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విజయనగరానికి తాగునీరు, భోగాపురం విమానాశ్రయానికి నీటి అవసరాలను తీర్చడమే కాకుండా, సుమారు 20 వేల ఎకరాలకుపైగా సాగునీరు అందించే తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఎంతో అవసరమని తెలిపారు. సుమారు 2.7 టిఎంసిల నీటిని నిల్వ ఉంచే రిజర్వాయర్ మట్టిగట్టు నిర్మాణ పనులు 60 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఆర్‌అండ్ఆర్ కింద దాదాపు రూ.175 కోట్లు పెండింగ్ ఉందని, దానిని చెల్లిస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి గోదావరి నదీ జలాలతో ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తామన్నారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ జూన్ నాటికి పూర్తి చేసి గోదావరి నుండి వంశధార వరకు అనుసంధానం చేయడం ద్వారా ఉత్తరాంధ్రకు సాగు నీరందిస్తామని తెలిపారు. అందుకోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.6500 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.



రామతీర్థసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

రాష్ట్రంలో భయానక వాతావరణం

- కక్షపూరిత రాజకీయాల వల్లే ఆంజనేయులు అరెస్టు
- రాజకీయ సలహా కమిటీ సమావేశంలో జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అక్రమాలు, అవినీతి ప్రజల్లోకి వెళ్లకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన వైసిపి రాజకీయ సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే డిజి స్థాయి అధికారి పిఎస్ఆర్ ఆంజనేయులును అరెస్టు చేయించిందని అన్నారు. కూటమి పాలనలో వ్యవస్థలన్నీ దిగజారాయని, దుష్ట సంప్రదాయానికి తెరలేపుతున్నారని చెప్పారు. లూలూ గ్రూపునకు రూ.1,500 కోట్ల విలువైన భూమిని ఇచ్చారని, రాజధాని అమరావతిలో అంతులేని దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. యథేచ్ఛగా అంచనాలు పెంచేస్తూ, రూ.36 వేలకోట్ల నుండి రూ.77 వేల కోట్లకు పెంచారని పేర్కొన్నారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరుతో కొత్త తరహా దోపిడీకి తెరలేపారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలు రద్దు చేశారని, సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయో చెప్పాలని ప్రశ్నించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి, విద్యాదీవెనకు రూ.7 వేలకోట్లు కావాల్సి ఉంటే రూ.700 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ అన్ని అంశాలమీద చర్చించి పార్టీకి సూచనలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రతినెలా పిఎసి సమావేశం ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో పార్లమెంటు నియోజకవర్గాలకు పరిశీలకులను నియమిస్తామని తెలిపారు. లోక్‌సభ సభ్యులు మిథున్‌రెడ్డిని కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షతోనే చంద్రబాబు ఇవన్నీ చేస్తున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీకి రూ.3,500 కోట్ల బకాయి పెట్టారని పేర్కొన్నారు. బటన్లు నొక్కి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు ఇస్తే దోపిడీకి వీలుకాదని, వాటిని ఎత్తేశారని అన్నారు. వక్ఫ్ చట్టం విషయంలో టిడిపి చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గుతున్నాయని, ఆక్వా రైతులు నష్టపోయారని, టారిఫ్‌ల బూచి చూపి రైతులను నిలువునా దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు జరుగుతున్న అన్యాయంపై కార్యాచరణ సిద్ధం చేయాలని కమిటీకి జగన్ సూచించారు. ఈ సమావేశానికి పెద్దిరెడ్డి, సజ్జల, వెలంపల్లి తదితరులు హాజరయ్యారు.

12 గంటలపాటు రాజ్ కసిరెడ్డిని ప్రశ్నించిన 'సిట్'

- మళ్లీ మెమో దాఖలుకు కోర్టు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లిక్కర్ కేసులో ప్రధాన నిందితుడుగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డిని సిట్ అధికారుల బృందం మంగళవారం రెండు విడతలుగా సుమారు 12 గంటల పాటు విచారించింది. ఈ కేసులో సిట్ సేకరించిన పలు ఆధారాలు, రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి, వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి విచారణలో చెప్పిన సమాచారంతో సిట్ అధికారులు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. తొలుత అధికారులకు కసిరెడ్డి సహకరించలేదని సమాచారం. రెండో విడత విచారణలో కొన్ని ఆధారాలతో సిట్ అధికారులు ప్రశ్నించారు. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పగా, మరికొన్నింటికి తనకు సంబంధం లేదని చెప్పినట్లు సమాచారం. లిక్కర్ కేసులో అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద మంగళగిరి సిఐడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సిట్ విచారణ అనంతరం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో రాజ్ కసిరెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించి, మూడో ఎసిఎంఎం కోర్టులో హాజరుపరిచారు. విచారణకు హాజరవుతానని చెప్పినా అరెస్ట్ చేశారని, కారు మినహా ఏమీ సీజ్ చేయలేదని న్యాయమూర్తికి కసిరెడ్డి చెప్పారు. విచారణలో తన తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టారని కసిరెడ్డి తెలపడంతో కసిరెడ్డి రిమాండ్ రిపోర్టుపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. గంట ముందు మెమో ఎలా దాఖలు చేస్తారని, మళ్లీ మెమో దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. దీంతో పబ్లిక్ ప్రాసిక్యూషన్ కొంత సమయం కోరింది. ఈ కేసులో వాదనలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. సిట్ రిమాండ్ రిపోర్టులో విజయసాయిరెడ్డి, సత్యప్రసాద్, మిథున్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి హైదరాబాద్‌లో సమావేశమైనట్లు పేర్కొన్నారు. మద్యం విధానం మారిస్తే నెలకు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లు కమిషన్ వస్తుందని భావించినట్లు, తాము సూచించిన బ్రాండ్లనే తీసుకోవాలని రాజ్ కసిరెడ్డి కోరినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.



నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న రామన్న

డిఎస్‌పి అభ్యర్థుల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డిఎస్‌సి అభ్యర్థులు తీవ్రంగా ఎదుర్కొంటున్న తొమ్మిది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కర్నూలు బిర్లాగేట్ రోడ్డుపైన డిఎస్‌సి అభ్యర్థులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎస్.హుస్సేన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానుద్దేశించి జి.రామన్న, జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ.. అనేక పోరాటాలు, ధర్నాలు, అరెస్టుల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఏడు సంవత్సరాల తర్వాత 16,347 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. 'ప్రధానంగా ఒకే జిల్లా -ఒకే పరీక్ష పేపర్ ఉండాలి, హెవీ సిలబస్ ఉన్నందు వల్ల ప్రిపేర్ అవ్వడానికి 70-90 రోజుల సమయాన్ని పొడిగించాలి. వయోపరిమితి 47సంవత్సరాలకు పెంచాలి. ఎపిపిఎస్‌సి పరీక్షలు జూన్ 16-26 వరకు, డిఎస్‌సి జూన్ 6-జూలై 6 వరకు ఉండడం వల్ల రెండు పరీక్షలు రాసేవారికి ఇబ్బందిగా ఉంటుంది. ఎస్‌జిటి స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీలో 40 శాతానికి మార్కులు తగ్గించాలి. బిఎడ్, టెట్, డైట్‌లో 40శాతం ఇచ్చారని, ఇప్పుడు 45 శాతం అంటే వారు అనర్హులవుతారు. స్కూల్ అసిస్టెంట్‌లో విద్యా అర్హతలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలి. కంప్యూటర్ సైన్స్, బిసిఎ, ఆప్షనల్ సబ్జెక్టుల సమస్యలున్నాయి. పిజికల్ హ్యాండీక్యాప్డ్‌లో 2024 డిఎస్‌సిలో చూపించిన పోస్టులను ప్రస్తుత డిఎస్‌సిలో చూపించలేదు. వాటిని ఈ డిఎస్‌సిలో చూపించాలి. పోస్టులు తక్కువగా ఉన్న అనంతపురం, ఒంగోలు, విజయనగరం నెల్లూరు జిల్లాలో పోస్టులు పెంచాలి' అని డిమాండ్ చేశారు. పై సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళనలు చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు.

ఆర్‌డిటి సేవలకు బిజెపి బ్రేక్..!

- ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్ పునరుద్ధరణ నిలిపివేత
- ఆగిపోనున్న సేవలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు కల్పతరువుగా ఉన్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి) సేవలకు కేంద్ర ప్రభుత్వం అడ్డుకట్టవేసింది. ఆ సంస్థకు సంబంధించి నిధుల వినియోగానికి అవసరమైన ఎఫ్‌సిఆర్ఎ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్టు) కింద అనుమతుల పునరుద్ధరణను నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ఫలితంగా ఇప్పటి వరకు ఆర్‌డిటి సంస్థ ద్వారా అందుతున్న సేవలకు బ్రేక్ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా విదేశీ నిధులతో నడుస్తున్న స్వచ్ఛంద సంస్థలపై బిజెపి ప్రభుత్వం కత్తికట్టిందన్న ఆరోపణలున్నాయి. ఇది వరకే ఆర్‌డిటికి విరాళాలు అందిస్తున్న విదేశీ సంస్థలపై నిషేధం విధించింది. దీనివల్ల ఏటా ఆర్‌డిటికి విరాళంగా వస్తున్న నిధుల్లో కోతపడింది. తాజాగా ఇప్పుడు లైసెన్సు పునరుద్ధరణ ఆపివేయడంతో నిధుల వినియోగంపైనా ప్రభావం పడనుంది.

ఏటా రూ.500 కోట్లకుపైగా బడ్జెట్ .?

1969లో అనంతపురం జిల్లాలో ఆర్‌డిటి ప్రారంభమైంది. అప్పటి నుంచి సేవలను విస్తరిస్తూ అనంతపురం జిల్లాలో ఒక భాగమైంది. క్రమంగా విస్తరిస్తూ రాష్ట్రంలో కర్నూలు, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ జిల్లాల్లో సేవలను అందిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో భూపాల్‌పల్లి, నాగర్‌కర్నూలు, నల్గొండ జిల్లాల్లో సేవలను అందిస్తోంది. ఏడాదికి సగటున రూ.500 కోట్లకుపైగా బడ్జెట్ ఉంటుంది. గతేడాది నుంచి ఈ సంస్థకు వచ్చే విరాళాలపై కేంద్రం నిషేధం విధించడంతో చాలా వరకు సేవలను ఈ సంస్థ తగ్గించుకుంటూ వస్తోంది. ఇక రెన్యువల్ జరగకపోతే పూర్తి స్థాయిలో సేవలు ఆగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆర్‌డిటి ద్వారా అందుతున్న సేవలు

అనంతపురం జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లినా బలహీన వర్గాలు, దళిత, గిరిజనులకు ఆర్‌డిటి కట్టించిన ఇళ్లు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు లక్ష వరకు ఇంటి నిర్మాణాలను చేశారు. అవి కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదల కోసం పెద్దఎత్తున కృషి చేశారు. స్పోర్ట్సు కాంప్లెక్సు ద్వారా గ్రామీణ క్రీడాకారులను తీర్చిదిద్దే కార్యక్రమాలు ముమ్మరంగా నడుస్తూ వస్తున్నాయి. వైద్యపరంగంలోనూ విశిష్టమైన సేవలను అందిస్తోంది. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్ ప్రాంతాల్లో మూడు ఆసుపత్రులున్నాయి. 532 పడకలతో ఈ ఆస్పత్రుల ద్వారా సేవలను అందిస్తున్నారు. ఇవి కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో క్లినిక్‌లు, మొబైల్ క్లినిక్‌లు నడుస్తున్నాయి. ఇంత పెద్దఎత్తున సేవలందిస్తున్న ఈ సంస్థపై బిజెపి ప్రభుత్వం వేటు వేసేందుకు సిద్ధపడటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

20న గ్రామీణ బంద్ : వ్యకాస

ప్రజాశక్తి - కొత్తూరు

ఉపాధి బకాయి వేతనాలు, పది దినాల పెంపు తదితర డిమాండ్లతో మే 20న దేశవ్యాప్త గ్రామీణ బంద్ చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం గూనభద్రలో మంగళవారం ఆయన పర్యటించారు. ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులకు కేంద్రం కోత పెడుతోందని విమర్శించారు. ఉపాధి హామీని నీరుగార్చి కార్మికుల పొట్ట కొడుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని, పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు, పనిదినాలు పెంచాలని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, కార్యదర్శి గంగరాపు సింహాచలం పాల్గొన్నారు.

పాఠశాలలకు రేపటి నుంచి వేసవి సెలవులు

- డైరెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పరిధిలో ఉన్న పాఠశాలలకు ఈ నెల 24 నుంచి జూన్ 11వ తేదీ వరకూ వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి విజయరామరాజు సర్క్యులర్‌ను మంగళవారం జారీ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలలకు చివరి పనిదినంగా బుధవారం (ఈ నెల 23) అని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. భారత వాతావరణశాఖ, వైద్య ఆరోగ్యశాఖ సూచనల ప్రకారం వేసవి సెలవుల్లో మార్పులకు అవకాశం ఉందని సర్క్యులర్‌లో వెల్లడించారు.

28న జివిఎంసి మేయర్ ఎన్నిక

- నోటిఫికేషన్ జారీ చేసిన ఎన్నికల కమిషనర్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ జివిఎంసి మేయర్ ఎన్నికను ఈ నెల 28న ఉదయం 11 గంటలకు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని విశాఖ జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎమ్ఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు నోటిఫికేషన్ ప్రకారం జివిఎంసికి ఎన్నికైన సభ్యులు, ఎక్స్-ఆఫీషియో సభ్యులకు మేయర్ ఎన్నిక నిమిత్తం ప్రత్యేక సమావేశానికి హాజరుకావాలని నోటీసు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మేయర్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు

- రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి కూటమి పాలనలో గతంలో ఎన్నడూ చూడని ప్రగతి, సంక్షేమం కొనసాగుతుండటంతో వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడుపు మండుతోందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక ఆడపిల్లను వేధించిన అధికారులను వెనకేసుకొస్తున్నారని, కూటమి ప్రభుత్వంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసినవారు పిఎస్ఆర్ అయినా, పెద్దిరెడ్డి అయినా శిక్ష తప్పదని మంత్రి పేర్కొన్నారు. తప్పుడు కేసులు, తప్పుడు సాక్ష్యాలు సృష్టించడంపై గతంలో అనేకసార్లు కోర్టులు గతంలో మీ ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు.

వేతన బకాయిల కోసం

రోడ్డెక్కిన ఉపాధి కార్మికులు

- విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం : వ్యకాస

ప్రజాశక్తి - భీమవరం



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి కార్మికులు

వేతన బకాయిల విడుదల కోసం ఉపాధి కార్మికులు రోడ్డెక్కారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ ఎదుట, ఏలూరు జిల్లాలో ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించారు. కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేశారు. ప్రమాదంలో మరణిస్తే రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ ఆందోళనలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన సభలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ..ఉపాధి హామీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. గతేడాది డిసెంబర్ నుంచి బకాయి వేతనాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా రూ.25.42 కోట్లు మేర బకాయిలు ఉన్నాయన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై స్థానిక రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, సహాయ కార్యదర్శులు బల్ల చినవీరభద్రరావు, జక్కంశెట్టి వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరిగి పని దినాలు తగ్గాయన్నారు. పని దినాలను వంద నుంచి 200 రోజులకు పెంచాలని, పోస్టాఫీస్‌ల ద్వారా వేతనాలు అందించాలని కోరారు. అనంతరం డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, డ్వామా ఎపిడికి వినతిపత్రాలు అందజేశారు. సభకు సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షత వహించారు. ఎనిమిది నుంచి తొమ్మిది వారాలుగా ఇవ్వాల్సిన ఉపాధి బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏలూరు జిల్లాలో జీలుగుమిల్లి, టి.నర్సాపురం, ఆగిరిపల్లి ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఆగిరిపల్లిలో నిర్వహించిన ధర్నాలో ఎపి వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణలు పునరావృతం కాకూడదు : సిపిఎం

ప్రజాశక్తి - పిఠాపురం(కాకినాడ జిల్లా)


మల్లం గ్రామంలో దళితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

సాంఘిక బహిష్కరణ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు డిమాండ్ చేశారు. దళితుల సాంఘిక బహిష్కరణనకు గురైన కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామంలో సిపిఎం బృందం మంగళవారం పర్యటించింది. గ్రామంలోని దళితులతో మాట్లాడి ఘటనపై ఆరా తీసింది. అనంతరం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సురేష్ కుటుంబాన్ని పరామర్శించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రసాదరావు మాట్లాడుతూ.. గ్రామంలోని దళితుడు పల్లపు సురేష్ అదే గ్రామానికి చెందిన కాపు సామాజిక తరగతికి సంబంధించిన వ్యక్తి ఇంట్లో ఎలక్ట్రికల్ పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. సురేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామంలోని దళితులందరూ ఆందోళన చేశారన్నారు. సమస్య సర్దుమణిగిన అనంతరం రెండు రోజుల తర్వాత దళితులను సాంఘిక బహిష్కరణ చేశారని, నిత్యావసర సరుకులు సైతం వారికి దక్కకుండా ఇబ్బందులకు గురిచేశారాన్నరు. సురేష్ కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల సాయం అందించాలని కోరారు. ఇటువంటి బహిష్కరణ ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో నాయకులు ఏడు కొండలు, సిపిఎం మండల కన్వీనర్ కుంచె చిన్న, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కూరకుల సింహాచలం, అంబేద్కర్ యూత్ సభ్యులు ఎద్దు సుబ్రహ్మణ్యం, సంజయ్ తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపిపి దారుణ హత్య

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో


వీరయ్య చౌదరి (ఫైల్ ఫొటో)

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండల మాజీ ఎంపిపి, టిడిపి నేత ముప్పవరపు వీరయ్య చౌదరి (49) మంగళవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం... ఒంగోలులో జాతీయ రహదారిపై పద్మ టవర్స్ సమీపంలో వీరయ్య చౌదరికి కార్యాలయం ఉంది. రాత్రి ఏడున్నర గంటల సమయంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కత్తులతో ఆయనపై దాడి చేశారు. తప్పించుకోకుండా ఉండేందుకు ఆఫీసు తలుపులు మూసివేసి విచక్షణారహితంగా పొడిచారు. శరీరంపై పదుల సంఖ్యలో కత్తిపోట్లు ఉన్నాయి. వీరయ్య చౌదరి కిందపడిపోగానే నలుగురు వ్యక్తులూ అక్కడి నుంచి పరారయ్యారు. చుట్టుపక్కల దుకాణాల వాళ్లు వెళ్లి గాయాలతో పడి ఉన్న వీరయ్యను అంబులెన్సులో రిమ్స్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ హత్యకు మద్యం వ్యాపారాల్లో ఆర్థిక లావాదేవీలే కారణమని అనుమానిస్తున్నారు. రియల్ ఎస్టేట్ తగాదాలు కూడా ఉన్నాయనే చర్చ సాగుతోంది. ఎస్పి దామోదర్, ఎఎస్పి నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసు జాగిలాలను రంగంలోకి దించారు. ఒంగోలులో చాలా ఏళ్ల తర్వాత ఓ అధికార పార్టీ నేత హత్య జరగడం చర్చగా మారింది. వీరయ్య హంతకులను వీలైనంత త్వరగా పట్టుకుంటామని ఎస్పి చెప్పారు.

ఎయు బయోకెమిస్ట్రీలో తొలి పేటెంట్

ప్రజాశక్తి-విశాఖపట్నం


డాక్టర్ అపరంజిని అభినందిస్తున్న ఎయు విసి రాజశేఖర్

ఆంధ్ర విశ్వ విద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగం నుంచి మొట్టమొదటి పేటెంట్ మంజూరైంది. బయో కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అపరంజి పూసర్ల రూపొందించిన 'టైప్ 2 డయాబెటిస్ కోసం పోర్టబుల్ బయో సెన్సార్'కు పేటెంట్ లభించింది. ఆవిష్కరణతో పేటెంట్ సాధించిన డాక్టర్ అపరంజిని ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జిపి.రాజశేఖర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా అభివృద్ధి చేసిన సాంకేతికత, పురోగతిని కమర్షియలైజ్ చేసిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రక్త నమూనా అవసరం లేకుండానే డయాబెటిస్, ఇతర సంక్రమణ రోగాలను తొందరగా గుర్తించే సాంకేతికతను డాక్టర్ అపరంజి అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నారు. ఆమె అభివృద్ధి చేసిన సాంకేతికత విధానం రోగులకు మరింత సౌకర్యవంతమైన, నొప్పిలేని ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది. పేటెంట్ సాధించడం పట్ల అపరంజిని ఈ రంగంలో చేస్తున్న కృషిని బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.రాఘవరావు అభినందించారు. ప్రొఫెసర్లు ఎం.జగన్నాథరావు, కె.అచ్యుతరావు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి చేసిన సాంకేతికతను కమర్షియలైజ్ చేసే విధానంలో భాగంగా ఈ సాంకేతికతను 2022లో అక్షయ ఇన్నోటెక్ పరిశ్రమకు బదలాయించారు.

వేట నిషేధ సాయం నిబంధనల్లో సవరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మత్స్యకారులకు చేపల వేట నిషేధ సమయంలో అందించే సాయానికి సంబంధించి నిబంధనల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మత్స్యశాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బి రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సవరణల్లో ప్రధానంగా వేట నిషేధ కాలానికి సాయాన్ని పొందేందుకు, నిషేధ కాలం ప్రారంభానికి ముందే మత్స్య శాఖ వద్ద నమోదు చేసుకున్న పడవలై ఉండాలని సవరణ చేశారు. గతంలో ఉన్న సబ్సిడీ డిజిల్ వినియోగ పరిమాణ నిబంధనలు తొలగించారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఇతర డిబిటి పథకాల్లో లబ్ధిపొంది ఉండకూడదనే నిబంధనను సవరించి, ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ స్కీంలో లబ్ధిపొంది ఉండకూడదని చేర్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆరు దశల పరిశీలన వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలవరంలో కేంద్ర బృందం

- రాళ్లు, కాంక్రీట్ నాణ్యత పరీక్ష

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో వినియోగించే కాంక్రీట్, రాళ్ల నాణ్యతను మంగళవారం కేంద్ర బృందాలు పరిశీలించాయి. సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సిఎస్ఆర్ఎంఎస్)కు చెందిన రెండు బృందాలు ఈ నాణ్యత పరీక్షల్లో పాల్గొన్నాయి. బట్రస్ డ్యామ్, డి వాల్ నిర్మాణ ప్రాంతం, 902 హిల్ ప్రాంతం మొదలైన వాటిని పరిశీలించాయి. ప్రాజెక్ట్ నిర్మాణంలో వినియోగించే కాంక్రీట్, అందులో కలిపే వివిధ రకాల మెటీరియల్స్‌ను నిపుణులు రవి అగర్వాల్, లలిత్ కుమార్ సోలంకి, రాళ్లను సందీప్ దనోటే పరిశీలించారు. కేంద్ర బృందం వెంట జలవనరుల శాఖ అధికారులు డి.శ్రీనివాస్, ఎం.శ్రీరాంపటేల్, ఆర్.దుర్గాప్రసాద్, ఆర్‌వి.చిరంజీవి, వి.జగదీష్, జి.సురేంద్ర, జాన్ కరణ్ ఉన్నారు, ఎంఇఐఎల్ జిఎం గంగాధర్, డిజిఎం మురళీ పమ్మి ఉన్నారు.

అనంతపురం జిల్లా జైలుకు బోరుగడ్డ : 30కు కేసు వాయిదా

ప్రజాశక్తి-అనంతపురం

'బెయిల్ కోసం నేను ఎటువంటి దొంగ సర్టిఫికెట్ పెట్టలేదు.' అని వైసిపి నాయకుడు బోరుగడ్డ అనిల్‌కుమార్ తెలిపాడు. అనంతపురం నగరంలోని మూడవ పట్టణ సిఐ మురళీకృష్ణను బెదిరించిన కేసులో విచారణ కోసమని మంగళవారం రాజమండ్రి జైలు నుంచి అనంతపురం తీసుకువచ్చి మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు తదుపరి విచారణను ఈనెల 30కి వాయిదా పడింది. దీంతో ఆయనను అనంతపురం జిల్లా జైలుకు తరలించారు. తరలించే సమయంలో అక్కడున్న మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 30 కేజీల బరువు తగ్గానని, బెయిల్ కోసం తాను ఏ దొంగ సర్టిఫికెట్ పెట్టలేదని చెప్పారు. రాఘవ శర్మ అనే డాక్టరు ఇచ్చిన సర్టిఫికెట్‌ను ఇచ్చానని చెప్పాడు. న్యాయ వ్యవస్థ మీద తనకు అపారమైన నమ్మకముందని తెలిపారు.

జిఒ 3పై ఆర్డినెన్స్ జారీ చేయాలి

- ఏజెన్సీ ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికే పవన్ కల్యాణ్ పర్యటన
- కార్పొరేట్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను బహిర్గతం చేయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి -పాడేరు (అల్లూరి జిల్లా)



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీలతోనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం జిఒ 3పై అసెంబ్లీలో చర్చ జరిపి ఆర్డినెన్సు జారీ చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్పెషల్ డిఎస్‌సి ఇస్తే గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. సిపిఎం అల్లూరి జిల్లా కార్యాలయంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి పి.అప్పలనరసతో కలిసి లోకనాథం మంగళవారం మీడియాతో మాట్లాడారు. మెగా డిఎస్‌సితోపాటు ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటిస్తారనే ఆదివాసీల ఆశలను ఒమ్ము చేశారన్నారు. ఆదివాసులు తమ రిజర్వేషన్ కోసం చేస్తున్న పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఏజెన్సీ టూరిజం అభివృద్ధి పేరుతో కేంద్రంతో రూ.25 వేల కోట్లతో ఇటీవల పలు ఒప్పందాలు జరిగాయన్నారు. కార్పొరేట్ కంపెనీలతో టూరిజం శాఖ చేసుకున్న ఒప్పందాలన్నీ గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే టిడిపి కూటమి ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్టను అదానికి అప్పగించిందని గుర్తు చేశారు. ఇటీవల పవన్ కల్యాణ్ పర్యటనలో ఏకోటూరిజం అభివృద్ధి చేస్తామని ప్రకటించారని, టూరిజం అభివృద్ధి ఒప్పందాలను ఎందుకు బయటకు చెప్పడంలేదని ప్రశ్నించారు. కార్పొరేట్ కంపెనీలకు టూరిజం అప్పగిస్తామంటే గిరిజనులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఫిబ్రవరి 19న ఢిల్లీలో జరిగిన సౌత్ ఏసియా ట్రావెల్స్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్‌లో కార్పొరేట్ కంపెనీలతో రహస్య ఒప్పందం కుదుర్చుకున్న పవన కల్యాణ్ ఏజెన్సీలో మూడుసార్లు పర్యటన చేశారని వివరించారు. ఏజెన్సీలోని ఒక్క గ్రామంలో 300 మందికి పవన్ కల్యాణ్ చెప్పులు పంపించారని, ఏజెన్సీ 11 మండలాల్లో చాలామంది గిరిజనుల కాళ్లకు చెప్పులు లేవన్న విషయాన్ని ఆయన గుర్తించాలన్నారు. చెప్పులు పంపించడం కాదని, ఏజెన్సీలో పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, జిసిసిని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సురేంద్ర, జిల్లా కమిటీ సభ్యులు పి.లక్కు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే..

- పిఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టుపై రోజా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, అందులో భాగంగానే డిజి కేడర్ అధికారి పిఎస్ఆర్ ఆంజనేయులును అరెస్టు చేశారని మాజీ మంత్రి రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే తట్టుకోలేకపోతున్నారని అన్నారు. ల్యాండ్, శాండ్, మైన్, వైన్ అన్నిటిలోనూ అవినీతి రాజ్యమేనని విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వ్యవస్థలను నాశనం చేస్తున్నారని అన్నారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా చేసిన ఆంజనేయులును అరెస్టు చేయడం చూస్తుంటే కూటమి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కచ్చితంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాబోయేది వైసిపి ప్రభుత్వమేనని, ఇప్పుడు తప్పు చేసిన వారిని తరువాత వదిలే ప్రసక్తే లేదని, న్యాయస్థానం ముందు నిలబెట్టి జైళ్లకు పంపుతామని అన్నారు. అమరావతి టెండర్లను రూ.77 వేల కోట్లకు పెంచి ప్రధానిని శంకుస్థాపనకు పిలుస్తున్నారని, దీనిలో పెద్దయెత్తున అవినీతి ఉందని అన్నారు. ఇప్పటికీ చంద్రబాబు పవన్‌కు ఎపిలో ఇళ్లు లేవని, ఇప్పుడు సిఎం కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నారని, పవన్ మాత్రం ఆ పనిచేయడం లేదని అన్నారు. 60 రోజులు ముందు పుట్టిన సూట్‌కేస్ కంపెనీకి 60 ఎకరాల విలువైన భూమిని ఎలా దారాధత్తం చేశారని ప్రశ్నించారు. విజయవాడ ఎంపి కేశినేని చిన్నికి చెందిన డొల్ల కంపెనీ అని విమర్శించారు.

లక్ష దాటేసిన బంగారం ధర

గ్రాము రూ.10,135

న్యూఢిల్లీ : బంగారం ధరలు రాకెట్‌లా దూసుకుపోతున్నాయి. తులం బంగారం రూ.1 లక్ష దాటేసింది. గ్రాము ధర రూ.10,000 పైమాటే. గుడ్‌రిటర్న్స్ సమాచారం మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఒక్క గ్రాముపై రూ.300 పెరిగి రూ.10,135గా పలికింది. అంతర్జాతీయంగా ఔన్సు లేదా 31.10 గ్రాముల బంగారం ధర 3,467 డాలర్లకు చేరింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.3,000 పెరిగి రూ.1,01,500గా నమోదయ్యింది. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన బంగారంపై రూ.2,750 పెరిగి రూ.93,050గా చోటు చేసుకుంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల ధర రూ.1,01,350గా, 22 క్యారెట్ల ధర రూ.92,900గా పలికింది. ట్రంప్ టారిఫ్‌లకు తోడు అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగించనుందన్న సంకేతాలు బంగారం ధరలకు ఆజ్యం పోస్తోన్నాయి.

కోరం లేక వీగిపోయిన యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

ప్రజాశక్తి - యలమంచిలి (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. మంగళవారం ఉదయం జరిగిన అవిశ్వాస ప్రత్యేక సమావేశానికి ప్రిసైడింగ్ అధికారి, నర్సీపట్నం ఆర్‌డిఒ వివి.రమణ తప్ప కౌన్సిలర్లంతా గైర్హాజరయ్యారు. 'కోరం లేనందున సమావేశం ముగిసింది. దీంతో అవిశ్వాస నోటీసు రద్దయింది. అవిశ్వాసం వీగిపోయింది' అని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. దీనిపై ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. అవినీతి అవిశ్వాసాన్ని ఓడించి ప్రజల విశ్వాసానికి దగ్గరయ్యామన్నారు. మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ.. వైసిపి జెండాతో గెలిచి అందలం ఎక్కిన తర్వాత పార్టీ మారిన వ్యక్తులకు టిడిపి కూటమి ప్రభుత్వం అండగా నిలవడం అనైతికమని అన్నారు.

వడదెబ్బకు మహిళా కార్మికురాలు మృతి


ప్రజాశక్తి- కోవెలకుంట్ల (నంద్యాల జిల్లా)

వడదెబ్బతో మహిళా కార్మికురాలు మృతి చెందిన ఘటన నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. మృతురాలి కుటుంసభ్యుల కథనం ప్రకాశం... భీమునిపాడు గ్రామానికి చెందిన సారమ్మ (60) మిరప కోత పనికి వెళ్లారు. మధ్యాహ్నం నుండి అస్వస్థతగా ఉన్న ఆమె సాయంత్రం పొలంలోనే స్పృహ తప్పి పడిపోయారు. కుటుంబ సభ్యులు సారమ్మను కోవెలకుంట్లలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, వడదెబ్బ వల్ల అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

దళితుల సాంఘిక బహిష్కరణ

- పోతురాజుపేటలో వివక్ష
- పట్టించుకోని రెవిన్యూ అధికారులు
- అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి-సంతకవిటి (విజయనగరం జిల్లా)


దళిత కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కేటాయించిన స్థలం

విజయనగరం జిల్లా సంతకవిటి మండలం పోతురాజుపేటలో దళితులను పెత్తందారులు సాంఘిక బహిష్కరణ చేశారు. దళిత కులానికి చెందిన దుంగ శ్రీరాములు, దుంగ గడ్డెమ్మ, దుంగ దాలయ్య మూడు కుటుంబాలను వెలివేశారు. దళితవాడకు ఆనుకొని ఉన్న నాలుగు సెంట్ల స్థలాన్ని బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 1994లో రెవెన్యూ అధికారులు కేటాయించారు. కొద్దిరోజుల క్రితం పెత్తందారులు ఆ స్థలాన్ని ఆక్రమించి, రూ.3.30 లక్షలకు బేరం పెట్టడంతో దళితులు అడ్డుకొని సంతకవిటి మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు, సర్వేయర్‌లు గ్రామానికి వచ్చి స్థలాన్ని చూసి వెళ్లారు తప్ప సమస్య పరిష్కరించ లేదు. దళితులైన దుంగ శ్రీరాములు, దుంగ గడ్డమ్మ, దుంగదాలయ్య తదితర కుటుంబాలను పెత్తందారులు వారి పనులు, శుభకార్యాలు, ఎటువంటి కార్యక్రమాలకూ పిలవకూడదని గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయించారు. గ్రామంలో పాల కేంద్రానికి వెళ్తున్న తమ పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ.... ఇబ్బందులకు గురిచేస్తున్నారని దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని దళితులు కోరుతున్నారు. మొత్తం 30 దళిత కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి.

పనులకు, శుభకార్యాలకు పిలవడం లేదు



అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ స్థలాన్ని ఆక్రమించిన పెత్తం దారులను వ్యతిరేకించామని మా మూడు కుటుంబాలను పనులకు గాని, శుభకార్యాలకు గానీ పిలవడం లేదు. ఎవరైనా తమను పనులకు పిలిస్తే జారీమానా వేస్తామని సమావేశంలో నిర్ణయించుకున్నారు. తక్షణమే మాకు న్యాయం చేయాలి.

దుంగ శ్రీరాములు, పోతురాజుపేట సంతకవిటి మండలం

సంపాదకీయం

మానవతావాది

మానవతావాదిగా పోప్ ఫ్రాన్సిస్‌ది సమకాలీన ప్రపంచంపై చెరగని ముద్ర. అందుకే ఆయన విలక్షణ వ్యక్తిత్వాన్ని ప్రశంసిస్తూ విశ్వవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటలీలో నియంత ముస్సోలిని అరాచకాలు భరించలేక అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్ వలస వచ్చిన ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన జార్జ్ మారియో బెర్గోగ్లియో నైట్‌క్లబ్ బౌన్సర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. సొసైటీ ఆఫ్ జీసస్‌లో చేరి కాథలిక్ ప్రీస్ట్ నుంచి అత్యున్నత పోప్ పదవిని చేపట్టడానికి పేదల పట్ల కరుణ, దయ, వినమ్రతే ప్రధాన కారణం. అర్జెంటీనా నుంచి తొలుత బాధ్యతలు చేపట్టిన వ్యక్తిగా చరిత్రకెక్కిన ఆయన తన పేరును పేదల కోసం పాటుపడిన సెయింట్ ఫ్రాన్సిస్‌లోని ఫ్రాన్సిస్‌గా మార్చుకోవడం మానవత్వానికే తన ప్రాధాన్యత అని చాటిచెప్పడమే. విలాసవంతమైన రాజభవనాల్లో, అడుగడుగునా హంగు ఆర్భాటాలతో జీవించే మత పెద్దలందరికీ ఫ్రాన్సిస్ భిన్నం. జీవితాంతం నిరాడంబరతను చాటిచెబుతూనే ఉండటం ప్రత్యేకత. వృద్ధులు, ఖైదీల కాళ్లు కడిగి ముద్దుపెట్టుకోవడం అణగారిన వర్గాలకు సన్నిహితంగా, అండగా ఉండాలనే సందేశమే. వాటికన్‌లో తన తొలి ఈస్టర్‌కు ముందుగా ఇటలీ ద్వీపకల్పమైన లాంపెడుసాను ఎంపిక చేసుకోవడమే కాదు... 88వ ఏట... తీవ్ర అస్వస్థతతో ఉన్నా, తన మరణానికి ముందురోజున ఈస్టర్ నాడూ సామాన్యులను కలుసుకోవడం ఆయన విశిష్టత. యూరప్ చేరుకునేందుకు వేలాదిమంది శరణార్థులు ప్రవేశించే లాంపెడుసాను ఎంచుకోవడం ప్రపంచీకరణ పేదల పట్ల చూపే ఉదాశీనతకు నిరసన. ప్రమాదకరంగా సముద్ర ప్రయాణాలు చేస్తూ మరణిస్తుండటం పట్ల ఆందోళన. వాతావరణ మార్పుల వల్ల పేద దేశాలకు జరుగుతున్న అన్యాయానికి ధనిక దేశాలదే బాధ్యత అని కుండబద్దలు కొట్టిన, పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా బయటకు రావడాన్ని నిరసించిన మరో మత పెద్ద మనకు కనిపిస్తారా? అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రసంగించిన తొలి పోప్ కూడా ఫ్రాన్సిసే. భూమిని, ప్రకృతిని, వాతావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రపంచంలోని అత్యంత ధనిక దేశానిదేనన్నారు. మెక్సికోకు వ్యతిరేకంగా సరిహద్దు గోడను ట్రంప్ తన తొలి విడత పదవీ కాలంలో నిర్మించడం క్రైస్తవ విరుద్ధమైన చర్య అంటూ ఖండించారు. ఇటీవల శరణార్థులను అమానవీయంగా సంకెళ్లు వేసి తరలించడంపైనా గళమెత్తారు. ప్రపంచ దేశాల మధ్య సయోధ్య, ప్రేమ, సత్సంబంధాల పెంపులోనూ ఆయన ముద్ర ఉంది. అమెరికా, క్యూబాల మధ్య చారిత్రక సయోధ్యకు, కొలంబియాలో శాంతికి తన వంతు ప్రయత్నాలు చేశారు.

మత బోధకులు పిల్లల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడటంపై సమాజానికి క్షమాపణ చెబుతూనే... వారి పట్ల, అవినీతికి పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరించడం ఆయన ప్రత్యేకత. మతానికి చెడ్డపేరు వస్తుందనో, వారి పలుకుబడికి భయపడో అలాంటి ఘటనలను దాచిపెట్టాలని భావించే మత ఛాందసులకు ఆయన వైఖరి భిన్నం. మరణ శిక్షను, పచ్చి మితవాద భావజాలాన్ని నిరసించారు.

యుద్ధాలను మానవతకు ఓటమిగా నిర్వచించడంతోపాటు మూడో ప్రపంచయుద్ధం తప్పదంటూ హెచ్చరించారు. డబ్బు కోసం మనుషులను కాల్చేసే వ్యాపారం అంటూ యుద్ధాలు చేసే దేశాలనూ, ఆయుధాలిచ్చే దేశాలనూ ఈసడించారు. యుద్ధాలు, అరాచకాల వల్ల కాందిశీకులుగా మారిన వారికి కాథలిక్ సంస్థల ద్వారా సహాయాన్ని అందించే ప్రక్రియను చేపట్టారు. ఇజ్రాయిల్, పాలస్తీనా, ఉక్రెయిన్ తదితర దేశాల అత్యున్నత స్థాయి బృందాలతో మాట్లాడి, యుద్ధాలను ఆపివేయాలంటూ శాంతి సందేశాన్నిచ్చారు. క్రైస్తవులు, ముస్లిముల మధ్య మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందీ ఆయనే. మహిళల హక్కుల కోసం గళమెత్తడంతోపాటు చేతల్లోనూ తెగువ చూపారు. రోమన్ కాథలిక్‌లలో ఉన్నత స్థానాల్లో పురుషులకే స్థానం కల్పించే సాంప్రదాయానికి స్వస్తి పలికి, అనేక మంది మహిళలకు ఉన్నత స్థానాలిచ్చారు. ఇటువంటి అనేక చర్యలను సాంప్రదాయ వాదులు తొలి నుంచీ నిరసిస్తూనే ఉన్నా... ముందడుగేసిన చరిత్ర ఆయనదే. పేరు ప్రఖ్యాతులు, పోప్‌గా లభించే అధికారాన్ని అనుభవించడం కన్నా, సామాన్య ప్రజల కష్టసుఖాలు తనవిగా భావించి, సమాజానికి మేలు చేయాలని భావించిన ఆయన కాథలిక్ సమాజానికే కాదు, మత పెద్దలందరికీ ఆదర్శనీయం!

మహనీయుల మాట



కల్లోలంగా వున్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.

- గోథే,
జర్మన్ రచయిత.

ట్రంప్ సుంకాల దాడిపై ఇండియా ఎలా స్పందించాలి?

తాను ప్రతిపాదించిన సుంకాల హెచ్చింపును ట్రంప్ 90 రోజులపాటు వాయిదా వేశాడు. ఇండియా, ఇతర దేశాలు వెంటనే ట్రంప్ సుంకాల దాడికి స్పందించనవసరం లేదనుకున్నా, 90 రోజుల తర్వాతనైనా స్పందించాలి కదా. ఇదేమీ ముగిసిపోయిన కథ కాదు. తనకు నచ్చిన విధంగా నడుచుకోని ఏ దేశం మీదనైనా సుంకాలను అధికంగా విధిస్తానని ట్రంప్ బెదిరిస్తున్నాడు. అమెరికా ఆధిపత్యాన్ని చెలాయించడానికి సుంకాల పెంపును ఒక ఆయుధంగా వాడుతున్నాడు. మరోపక్క అలా పెంచిన సుంకాల ద్వారా తన దేశంలో ఉత్పత్తి కార్యకలాపాలను పెంచుకోడానికి, అమెరికా వ్యాపార లోటును తగ్గించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. మనం ఇప్పుడు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒక కొత్త దశను చూస్తున్నాం. పరిస్థితి అంతా సజావుగానే ఉన్నట్టు ఇండియా వంటి దేశాలు గనుక నటించడానికి పూనుకుంటే అంతకన్నా అర్థం లేని విషయం ఇంకొకటి ఉండదు. ఇక్కడ విధానాలను యథావిధిగా కొనసాగించేద్దాం అని ఇండియా భావిస్తున్నట్టు ఉంది. ఇప్పుడు కొనసాగిస్తున్న విధానాలు దేశంలోని శ్రామిక ప్రజానీకానికి చాలా కష్టాలను తెచ్చిపెట్టాయి. ఆ విధానాలు చాలా బ్రహ్మాండంగా ఉన్నాయి అనుకున్న రోజుల్లోనే శ్రామిక ప్రజలు చాలా కష్టాలు పడ్డారు. ఇప్పుడు తాజా పరిస్థితిలో కూడా ఆ విధానాలనే కొనసాగిస్తే దాని వలన వారు మరింత ఎక్కువగా కష్టాలపాలౌతారు. అంతేగాక, అమెరికన్ సామ్రాజ్యవాద పెత్తనానికి మనం మరింతగా తలొగ్గవలసి వస్తుంది.



ప్రభాత్ పట్నాయక్

"యథావిధిగా వ్యాపారం" అంటే ప్రపంచ మార్కెట్ వేగంగా విస్తరిస్తోందని, దాని నుండి పూర్తి ప్రయోజనాన్ని పొందడానికి ఇండియా వంటి దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను నిబంధనలు లేని స్వేచ్ఛా వ్యాపారానికి అనుమతించాలని, ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ మీద నియంత్రణ కొనసాగించకూడదని అర్థం. నయా ఉదారవాద విధానాలను ప్రవేశ పెట్టిన సమయంలో చెప్పినది ఇదే. ఈ వాదన శుద్ధ తప్పు, అమెరికాలో హౌసింగ్ బుడగ పేలిపోయినప్పుడే ఆ సంగతి స్పష్టం అయిపోయింది. ఇప్పుడు ట్రంప్ ప్రదర్శిస్తున్న తెంపరితనం స్వేచ్ఛా వ్యాపారం అనేది వొట్టి బోగస్ వాదన అని మరీ స్పష్టంగా తేల్చేసింది. నయా ఉదారవాద విధానాలు భారతదేశ ప్రజానీకపు జీవితాలకు, మన దేశ స్వాతంత్ర్యానికి వినాశనకరంగా పరిణమించాయన్న వాస్తవాన్ని ఇప్పుడైనా గ్రహించకపోవడం అంటే అది చాలా ప్రమాదకరం.

నయా ఉదారవాద విధానాలను బలపరుస్తున్న కొందరు వాదిస్తున్న తీరు ఇలా ఉంది: ఇప్పుడు అమెరికా, చైనాల నడుమ సుంకాల యుద్ధం నడుస్తోంది గనుక, ఇకముందు కాలంలో వారిద్దరి మధ్యా వాణిజ్యం కొనసాగే అవకాశం లేదు కనుక, అమెరికాతో వాణిజ్యం నడపడానికి చైనా స్థానాన్ని భారతదేశం తీసుకోవాలి. ఈ వాదనను మాట వరసకు ఒప్పుకుందాం. ఇప్పుడు అమెరికాతో వాణిజ్యాన్ని నడపాలంటే మన దేశం ట్రంప్‌ను సంతృప్తిపరచాలి. అప్పుడు మన

ఈ పరిస్థితుల్లో నయా ఉదారవాద చట్రం నుండి బద్దలుకొట్టుకుని బైటపడడం అనేది శ్రామిక ప్రజానీకానికి చాలా ముఖ్యం. అప్పుడే వారు తమ భవిష్యత్తును తమ చేతుల్లోకి తీసుకోగలుగుతారు. ట్రంప్ ప్రదర్శిస్తున్న దూకుడు ఇప్పుడు అందుకొక అవకాశాన్ని కల్పించింది.



ఇప్పుడు ట్రంప్ ప్రదర్శిస్తున్న తెంపరితనం స్వేచ్ఛా వ్యాపారం అనేది వొట్టి బోగస్ వాదన అని మరీ స్పష్టంగా తేల్చేసింది. నయా ఉదారవాద విధానాలు భారతదేశ ప్రజానీకపు జీవితాలకు, మన దేశ స్వాతంత్ర్యానికి వినాశనకరంగా పరిణమించాయన్న వాస్తవాన్ని ఇప్పుడైనా గ్రహించకపోవడం అంటే అది చాలా ప్రమాదకరం.

దేశం నుండి ఎగుమతులు అమెరికాకు తాత్కాలికంగానైనా పెరగవచ్చు. అయితే, ఇప్పుడు ట్రంప్ సాగిస్తున్న యుద్ధం చైనాను తన వాణిజ్య భాగస్వామిగా ఉండకుండా చేయడానికి కాదు. అమెరికాకు వాణిజ్యంలో ప్రస్తుతం ఉన్న లోటును తగ్గించుకోవడం ట్రంప్ లక్ష్యం. అంటే తాత్కాలికంగా చైనాకు బదులు మనం అమెరికాతో సాగించే వాణిజ్యం ఎంతో కాలం పాటు కొనసాగే అవకాశం లేదు.

అయినప్పటికీ, తాత్కాలికంగానైనా ప్రయోజనం పొందాలంటే మనం చైనా స్థానాన్ని ఆక్రమించడానికి తాపత్రయపడే ఇతర దేశాలతో పోటీ పడాలి. ఆ దేశాలతో పోటీ పడి మన రూపాయి విలువను తగ్గించుకోవాలి. ఇప్పటికే మన రూపాయి మారకపు విలువ క్షీణిస్తోంది. అది మరింత హీన స్థాయికి చేరుతుంది. అది కూడా మనం ట్రంప్ విధించిన అధిక సుంకాలకు ప్రతిస్పందించకుండా ఉన్నప్పుడు మాత్రమే. అంటే అమెరికా నుండి వచ్చే దిగుమతుల మీద మనం సుంకాలను పెంచకుండా ఉండాలి. ట్రంప్ మాత్రం తాను పెంచిన సుంకాలను అలాగే కొనసాగిస్తాడు. దీనివలన మన రూపాయి మారకపు విలువ మరింత పడిపోతుంది. మన నయా ఉదారవాద సమర్ధకుల సలహాను పాటిస్తే జరిగేది ఇదే.

రూపాయి మారకపు విలువ తగ్గిపోతే దాని ఫలితంగా కార్మికుల నిజవేతనాలు పడిపోతాయి. దీనిని ఒక తేలికపాటి ఉదాహరణతో వివరించవచ్చు: ఒక దేశం రూ.220 విలువగల సరుకులను ఉత్పత్తి చేసిందనుకుందాం. అందులో దిగుమతి చేసుకున్న ఇన్‌పుట్స్ విలువ రూ.100 అని, కార్మికుల వేతనాల ఖర్చు రూ.100 అని, రూ.20 పెట్టుబడిదారుడికి మిగిలే లాభం అని అనుకుందాం. ఇప్పుడు రూపాయి మారకపు విలువ 10 శాతం తగ్గిందనుకుంటే దాని ఫలితంగా దిగుమతి చేసుకున్న ఇన్‌పుట్స్ విలువ రూ.110 అవుతుంది. కార్మికుల నిజవేతనాల స్థాయిగాని, పెట్టుబడిదారుడి లాభం స్థాయిగాని యథాతథంగా కొనసాగితే అప్పుడు కార్మికుల వేతనాలు రూ.110, పెట్టుబడిదారుడి లాభం రూ.22 అవుతాయి. అప్పుడు ఉత్పత్తి అయిన సరుకు విలువ రూ.242 అవుతుంది. ఇది అంతకు ముందు ఉన్న విలువ కన్నా 10 శాతం ఎక్కువ. అయితే ఈ సరుకు విలువ డాలర్లలో లెక్కించినప్పుడు గతంలో ఎంత రేటు ఉండేదో ఇప్పుడూ అంతే ఉండాలి. అలా ఉండాలంటే పెట్టుబడిదారుడి లాభం వాటా కాని, కార్మికుల వేతనాల వాటా కాని లేదా రెండూ కాని తగ్గాలి. పెట్టుబడిదారీ సమాజంలో లాభం ఎంత ఉండాలనేది నిర్ణయించుకునేది పెట్టుబడిదారుడే. కనుక తన లాభాన్ని తగ్గించుకోడు. ఇక మిగిలింది కార్మికుల వేతనాలు మాత్రమే. వాటిని కార్మికులు నిర్ణయించగలిగే స్థితి లేదు. అందుచేత అనివార్యంగా కార్మికుల నిజ వేతనాలు తగ్గిపోతాయి. అదే సుంకాల విషయంలోనైతే వాటిని కొన్ని ఎంపిక చేసిన సరుకుల మీద మాత్రమే విధిస్తారు కనుక దిగుమతి చేసుకునే ఇన్‌పుట్స్ మీద సుంకాలను పెంచకపోతే కార్మికుల వేతనాలు తగ్గకపోవచ్చు.

నయా ఉదారవాద సమర్ధకులు ట్రంప్ సుంకాలను పెంచినా, మనం పెంచకుండా ఉండాలని, మన రూపాయి మారకపు విలువను తగ్గించుకుని వాణిజ్యాన్ని కొనసాగించాలని అంటున్నారు. అంటే వీరు పరోక్షంగా కార్మికుల నిజవేతనాలను మరింత తగ్గించాలని సూచిస్తున్నారన్నమాట. ట్రంప్ విధించే అధిక సుంకాలకు మూల్యం కార్మికులు చెల్లించాలని వీరంటున్నారు. ట్రంప్ మొత్తంగానే తన దిగుమతులను తగ్గించుకుని తన దేశంలోనే ఉత్పత్తులను పెంచుకోవాలని అనుకుంటున్నది ఆచరణ రూపం దాల్చితే...మనం రూపాయి మారకపు విలువను తగ్గించుకున్నప్పటికీ, మన దేశం నుండి ఎగుమతులు పెద్దగా పెరిగేది ఏమీ ఉండదు. అంటే ఉపాధి అవకాశాలు అదనంగా కలిగేవి ఏమీ ఉండవు. మన రూపాయి విలువను తగ్గించుకుని చౌకగా అమెరికాకు ఎగుమతులు చేసినా, అక్కడ వాటిని కొనేవారు పెరగనప్పుడు ఇక్కడ మన ఉపాధి అవకాశాలు ఉన్నవి కూడా తగ్గిపోయే ప్రమాదం కూడా ఉంటుంది.

అమెరికాతో చైనా ఇంతవరకూ సాగించిన వాణిజ్యం స్థానంలోకి చొరబడడానికి ప్రయత్నించే వివిధ దేశాలు తమ తమ కరెన్సీల మారకపు విలువలను తగ్గించుకోడానికి సిద్ధపడినప్పుడు వాటి నడుమ ఒక పోటీ నెలకొంటుంది. అప్పుడు ఇండియా కూడా వాటితో పోటీ పడాల్సి వుంటుంది. ఇలాంటి పోటీలో రూపాయి మారకపు విలువ పడిపోబోతోందని అంచనా వేసే స్పెక్యులేటర్లు ముందుగానే మన దేశం నుండి తమ సంపదను వేరే ప్రాంతాలకు తరలించడం మొదలుపెడతారు. దానివలన రూపాయి విలువ మరింత పడిపోతుంది. అది కార్మికుల జీవితాలను మరింతగా దుర్భరం చేస్తుంది.

ఈ ప్రతికూల పరిణామాలను తట్టుకోడానికి వీలుగా దేశంలో ఉత్పత్తి కార్యకలాపాలను పెంచాలి. దానితోబాటు ఉపాధి అవకాశాలను పెంచాలి. ఇదంతా జరగాలంటే ప్రభుత్వం తన వ్యయం పెంచాలి. ముఖ్యంగా సంక్షేమ చర్యల మీద వ్యయాన్ని పెంచాలి. ఈ వ్యయానికి కావలసిన అదనపు ధనాన్ని సంపద పన్ను విధించడం ద్వారా సమకూర్చుకోవాలి. అంటే మార్కెట్ శక్తుల మీద ప్రభుత్వ నియంత్రణను మళ్ళీ ప్రవేశపెట్టాలి. అంటే నయా ఉదారవాద విధానాలకు స్వస్తి చెప్పాలి.

నిజానికి ట్రంప్ ప్రారంభించిన సుంకాల యుద్ధం నయా ఉదారవాద చట్రం నుండి బైట పడడానికి మన దేశానికి లభించిన ఒక మంచి అవకాశం. ఇప్పుడు ట్రంప్ మీద ప్రతిచర్యగా మన సుంకాలను పెంచి, రూపాయి మారకపు విలువను యథాతథంగా కొనసాగించాలి. అమెరికానుండి వచ్చే దిగుమతుల ధరలు పెరిగినందువలన మన దేశంలో వాటి ధరలు పెరుగుతాయి. దాని వలన ఏర్పడే ద్రవ్యోల్బణాన్ని అదుపు చెయ్యాలంటే రూపాయి విలువను యథాతథంగా కొనసాగించడం అవసరం. ఒకవేళ విదేశీ చెల్లింపులలో లోటు పెరిగే స్థితి వస్తుందనుకుంటే అప్పుడు వాణిజ్యం మీద, పెట్టుబడుల రాకపోకల మీద నియంత్రణలను విధించాలి. ఈ ప్రతికూల పరిణామాలను తట్టుకోడానికి వీలుగా దేశంలో ఉత్పత్తి కార్యకలాపాలను పెంచాలి. దానితోబాటు ఉపాధి అవకాశాలను పెంచాలి. ఇదంతా జరగాలంటే ప్రభుత్వం తన వ్యయం పెంచాలి. ముఖ్యంగా సంక్షేమ చర్యల మీద వ్యయాన్ని పెంచాలి. ఈ వ్యయానికి కావలసిన అదనపు ధనాన్ని సంపద పన్ను విధించడం ద్వారా సమకూర్చుకోవాలి. అంటే మార్కెట్ శక్తుల మీద ప్రభుత్వ నియంత్రణను మళ్ళీ ప్రవేశపెట్టాలి. అంటే నయా ఉదారవాద విధానాలకు స్వస్తి చెప్పాలి.

మళ్ళీ ప్రభుత్వ నియంత్రణ తేవాలి అనగానే మన నయా ఉదారవాద సమర్ధకులు వణికిపోతారు. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్, తదితర సంస్థల ప్రభావం, గుత్త పెట్టుబడిదారుల అధీనంలో ఉన్న మీడియా ప్రభావం ఎంత ఎక్కువగా ఉందంటే సామాన్య ప్రజలు కూడా ప్రభుత్వ నియంత్రణలో ఉండే విధానానికి వెనక్కి మళ్ళాలనగానే వారు విముఖతను ప్రదర్శిస్తారు.

ఇక్కడ మూడు విషయాలను స్పష్టం చేయాలి. **మొదటిది:** ప్రభుత్వ నియంత్రణ ఉన్న వ్యవస్థలో అభివృద్ధి అనేది ముఖ్యంగా వ్యవసాయంలో సాధించే వృద్ధి మీద ఆధారపడి వుంటుంది. కాని నయా ఉదారవాద విధానాల వలన వ్యవసాయం లో వృద్ధి లేకుండా పోయింది. వ్యవసాయ రంగానికి ఊపిరి సలపకుండా చేసేశారు. ఇప్పుడు సరైన చర్యలు చేపడితే వ్యవసాయ రంగం పునరుజ్జీవనం పొంది లాభాల బాటలో నడవడమే కాకుండా గతంలో సాధించలేకపోయిన ఉన్నత స్థాయికి కూడా చేరుకోగలుగుతుంది.

రెండవది: తలసరి ఆహార ధాన్యాల వినియోగం నయా ఉదారవాద విధానాలకు పూర్వం ఉన్న స్థాయి కన్నా నయా ఉదారవాద కాలంలో తగ్గిపోయింది. పేదరికం నికరంగా పెరిగింది. 2017-18 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో కనీస పౌష్టికాహారం పొందలేకపోతున్నవారు 80 శాతానికి చేరుకున్నారు.

మూడవది: ఆదాయాల్లో, సంపదల్లో అసమానతలు నయా ఉదారవాద కాలంలో మరింత ఎక్కువ అయ్యాయి. దేశంలోని అత్యంత సంపన్నులైన 1 శాతం వ్యక్తుల వాటా దేశ సంపదలో 12 శాతంగా 1947 నాటికి ఉండేది. అది 1982 నాటికి 6 శాతానికి తగ్గింది. కాని ఇప్పుడ నయా ఉదారవాద విధానాల కారణంగా 23 శాతానికి పెరిగింది. అంటే ఎంత తీవ్ర స్థాయిలో అసమానతలు పెరిగాయో స్పష్టం అవుతోంది.

ఈ పరిస్థితుల్లో నయా ఉదారవాద చట్రం నుండి బద్దలుకొట్టుకుని బైటపడడం అనేది శ్రామిక ప్రజానీకానికి చాలా ముఖ్యం. అప్పుడే వారు తమ భవిష్యత్తును తమ చేతుల్లోకి తీసుకోగలుగుతారు. ట్రంప్ ప్రదర్శిస్తున్న దూకుడు ఇప్పుడు అందుకొక అవకాశాన్ని కల్పించింది.


(స్వేచ్ఛానుసరణ)

కొనుగోళ్లు లేక 'బర్లీ' రైతు బెంగ



మంగళ సూత్రాలను తాకట్టు పెట్టాను. ఎరువులు, పురుగు మందులు అన్నీ అప్పులే. చివరికి చెవి దిద్దులు, ముక్కుపుడక తాకట్టు పెట్టి కూలి డబ్బులు ఇచ్చాము. ప్రతి సంవత్సరం కొంతమంది కూలీలు కూడా డబ్బులు ఇవ్వలేక మొహం చాటేస్తున్నాం. తాకట్టు పెట్టిన బంగారం వెంటనే విడిపించుకోకపోతే బంగారం ఇచ్చేదిలేదని తాకట్టు పెట్టుకున్న వ్యాపారి కబురు చేశారు. ఇళ్లల్లో పొగాకు, రోడ్ల మీద మనుషులు, పశువులు, జీవాలు...! ఇవి బాపట్ల జిల్లా పర్చూరు, ఇంకొల్లు మరికొన్ని చుట్టుపక్కల మండలాల్లోని గ్రామాలన్నిటిలో బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల పరిస్థితి.

రాష్ట్రంలో దాదాపు లక్ష ఎకరాలకు పైగా నల్ల బర్లీ పొగాకు వేశారు. వీరిలో 80 శాతం పైగా కౌలు రైతులే ఉన్నారు. గత రెండు సంవత్సరాల్లో తెగుళ్ల వచ్చి మిర్చి వేసిన రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరోవైపు గత సంవత్సరం నల్ల బర్లీ పొగాకు పంట క్వింటా రూ.15 నుండి రూ.18 వేలకు అమ్ముడుపోయింది. చివరకు అడుగులు (నాసిరకంగా వున్నా) కూడా రూ.12 వేలకు బంగారం లాగా వ్యాపారులు కళ్ళకు అద్దుకుని కొనుక్కుపోయారు. అలాగే జి.పి.ఐ, ఐ.టి.సి తదితర కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు ఒకటికి నాలుగు సార్లు గ్రామాలకు, రైతుల చుట్టూ తిరిగి మొత్తం పొలమంతా నల్ల బర్లీ పొగాకు వేయమని ప్రోత్సహించారు. 'కొంత నల్ల బర్లీ, మరికొంత వైట్ బర్లీ పొగాకు లేదా మిర్చి వేస్తారేమో...అలా వేయొద్దు. మొత్తం నల్ల బర్లీ వేయండి' అని చెప్పారు. పైగా గత సంవత్సరం రేటు మరో రెండు మూడు సంవత్సరాలు నిలకడగా ఉంటుందని వ్యాపారులు వారికి భరోసా ఇచ్చారు. దానితో కౌలు రేట్లు పెరిగినా లెక్క చేయకుండా పొలాన్ని కౌలుకు తీసుకున్నారు.



ఎం. హరిబాబు

రెగ్యులర్‌గా కౌలు చేసే వారే కాకుండా ఈ మధ్యకాలంలో సంచార జాతులుగా చెప్పుకునే యానాది, ఎరుకల తదితర సామాజిక తరగతులకు చెందిన పేదలు కూడా పొలాలు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేశారు. పంట బాగా పండితే గత సంవత్సరం లాగా ధర వస్తే అప్పులన్నీ తీర్చుకోవచ్చు. అప్పుల నుండి బయటపడి ఊపిరి పీల్చుకుందామనుకున్నారు. కానీ నల్ల బర్లీ పొగాకు వేసిన రైతులు, కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారిపోయింది. కౌలు రేట్లు రూ.25 వేల నుండి రూ.35, 40 వేల వరకు పెరిగింది. పొగాకు గుచ్చటానికి రూ.40 వేలు, ట్రాక్టర్‌తో దుక్కికి రూ.10 వేలు, ఎరువులకు రూ.10 వేలు అవుతోంది. 75 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం కూడా పంట పండించుకోవడానికి నీళ్లకు కనీసం రూ.10 వేల రూపాయలు ఖర్చు చేశారు. ఎద్దులతో సాళ్ళ ఏర్పాటుకు రూ.5000, నారుకు రూ.పది వేలు ఇతరత్రా అన్నీ కలుపుకుని ఎకరాకు సాగు చేయడానికి రూ.1,50,000 పైనే ఖర్చు అయింది. గత సంవత్సరం ఎకరాకు సరాసరిన 18 క్వింటాళ్ల పొగాకు దిగుబడి వచ్చింది. ఈ సంవత్సరం ఖర్చులు పెరగడంతో పాటు దిగుబడి కూడా తగ్గింది. ఈ సంవత్సరం సగటున పది నుండి 13 క్వింటాళ్ళ దిగుబడి ఉంటుందని రైతులు అంచనా వేస్తున్నారు.

గత సంవత్సరం అత్యంత ఎక్కువ ధర పొందిన నల్ల బర్లీ పొగాకు రైతుల పరిస్థితి తారుమారైంది. గత సంవత్సరం క్వింటా రూ.18,000 ధర వస్తే నేడు అదే పంట కేవలం రూ.3000 మాత్రమే ధర పలుకుతున్నది. కొన్ని ప్రాంతాలలో అసలు కొనలేమని ప్రకటించి వ్యాపారులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పొగాకును పరిశీలించి నాణ్యత, తేమ శాతం అన్నీ సక్రమంగా ఉన్నాయని పాస్ చేసి మళ్లీ తిరస్కరిస్తున్నారు. జనవరి నుండి బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కావటం ఆనవాయితీ. కానీ ఈ సంవత్సరం ఆ ఆనవాయితీ దాటి 120 రోజులు గడిచినా పట్టించుకునే దిక్కుమొక్కు లేక రైతులు పొగాకు ఎలా అమ్ముకోవాలా అని ఎదురు చూస్తున్నారు. కంపెనీలు, దళారులు కుమ్మక్కై బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. మీరు ఆందోళన చేస్తే ధర మరింత తగ్గుతుంది. కొనటం ఇంకా ఆలస్యం అవుతుందని కంపెనీల ఏజెంట్లతో ప్రచారం చేయిస్తున్నారు.

ఈ పరిస్థితికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల కోసం బడ్జెట్లో కేటాయింపులు సున్నా చేయటం. అలాగే కంపెనీలు కుమ్మక్కై ధరలు పడవేయటం. అంతేగాక...కంపెనీల మాయాజాలాన్ని కంట్రోల్ చేయాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీలకు తలొగ్గాయి. పొగాకు సాగు చేసిన రైతుల్ని పట్టించుకోలేకపోయాయి. కంపెనీలకు అవసరమైన అనేక సౌకర్యాలను ప్రభుత్వాలు అందిస్తున్నాయి. పంటలు సాగు చేస్తున్న రైతులకు కౌలు రైతులకు హామీ ఇచ్చినట్లు అన్నదాతా సుఖీభవ డబ్బు రూ.20 వేలు రైతుల ఖాతాల్లో నేటికీ జమ చేయలేదు. పాత కౌలు చట్టాలను రద్దు చేసి కొత్త కౌలు చట్టం తీసుకొచ్చి కౌలు రైతులకు రక్షణగా ఉంటామన్న హామీ ఇంతవరకు ఆచరణ రూపం దాల్చలేదు. పాత ప్రభుత్వం టెక్నాలజీని సరిగా ఉపయోగించలేదని పంటను కాపాడుకోవడానికి అవసరమైన పరికరాలు, పరదాలు ఏమీ ఇవ్వలేదు. అవన్నీ ఇచ్చి రైతన్నను ఆదుకుంటానన్న హామీ నీటి మీద రాతగానే ఉండిపోయింది. పొగాకు పండించిన రైతులను ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి.

పర్చూరు మండలం చిన్న నందిపాడు గ్రామంలో పంట రుణాలు కట్టాలంటూ బ్యాంక్ అధికారులు లాయర్ నోటీసులు పంపించారు. ఐదుగురు సభ్యులున్న జాయింట్ లయబిలిటీ గ్రూపు రూ.2.5 లక్షలు అప్పు తీసుకుంటే... నేడు అసలు, వడ్డీ కలిపి రూ.4.74 లక్షలైంది. కట్టకపోతే కోర్టుకు ఈడుస్తామని న్యాయవాదులతో నోటీసులు పంపించారని ఆ గ్రామ కౌలు రైతులు సింగారావు, కోట మరియదాసు, కట్టా సూర్యం తెలిపారు. చెవి పోగులు, ముక్కు దిద్దులు, మెడలో ఉన్న మంగళ సూత్రాలు తాకట్టుపెట్టి కూలి డబ్బులు చెల్లించామని దగ్గుపాడు గ్రామస్తులు ఫకీర్ సాహెబ్, పెద్ద సుబ్బయ్య చెప్పారు. అయితే తాకట్టు పెట్టుకున్న వ్యాపారి గడువు అయిపోతున్నదని వెంటనే డబ్బులు కట్టి బంగారం విడిపించుకోకపోతే మీ బంగారం మీకు దక్కదని వ్యాపారులు కబురు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కొంత పొగాకు, కొంత మిర్చి వేసే వాళ్ళం. ఏదో ఒక పంట ముందు అమ్ముకుని కూలి డబ్బులిచ్చి అప్పులు కొంతైనా తీర్చుకునే వాళ్ళం. కంపెనీ వాళ్ళు చెప్పిన మాట నమ్మి అంతా బ్లాక్ బర్లీ పొగాకు వేసి కూలి డబ్బులు కూడా ఇవ్వలేకపోతున్నాం. అప్పుల వాళ్ళు మీద పడుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నామని వంకాయలపాడు గ్రామానికి చెందిన రామలింగారెడ్డి వెంకట్రెడ్డి, కొండయ్య, రఘు, మురళి తదితరులు దిగాలుగా చెప్పారు.

ఈ పరిస్థితికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల కోసం బడ్జెట్లో కేటాయింపులు సున్నా చేయటం. అలాగే కంపెనీలు కుమ్మక్కై ధరలు పడవేయటం. కంపెనీల మాయాజాలాన్ని కంట్రోల్ చేయాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీలకు తలొగ్గాయి. పొగాకు సాగు చేసిన రైతుల్ని పట్టించుకోలేకపోయాయి. కంపెనీలకు అవసరమైన అనేక సౌకర్యాలను ప్రభుత్వాలు అందిస్తున్నాయి. పంటలు సాగు చేస్తున్న రైతులకు కౌలు రైతులకు హామీ ఇచ్చినట్లు అన్నదాతా సుఖీభవ డబ్బు రూ.20 వేలు రైతుల ఖాతాల్లో నేటికీ జమ చేయలేదు. పాత కౌలు చట్టాలను రద్దు చేసి కొత్త కౌలు చట్టం తీసుకొచ్చి కౌలు రైతులకు రక్షణగా ఉంటామన్న హామీ ఇంతవరకు ఆచరణ రూపం దాల్చలేదు. పాత ప్రభుత్వం టెక్నాలజీని సరిగా ఉపయోగించలేదని పంటను కాపాడుకోవడానికి అవసరమైన పరికరాలు, పరదాలు ఏమీ ఇవ్వలేదు. అవన్నీ ఇచ్చి రైతన్నను ఆదుకుంటానన్న హామీ నీటి మీద రాతగానే ఉండిపోయింది. పొగాకు పండించిన రైతులను ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. అన్ని రకాల పొగాకు పంటలను పొగాకు బోర్డు పరిధిలోకి కేంద్రం తీసుకురాలేకపోవడంతో ప్రభుత్వాలు కంపెనీలను నియంత్రించటం కాకుండా కంపెనీలే ప్రభుత్వాలను, మంత్రులను కంట్రోల్ చేస్తున్నాయి. ఫలితంగా ఈ సంవత్సరం నల్ల బర్లీ పొగాకు పండించిన రైతులు, కౌలు రైతులు నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు. కళ్ళ ముందు అన్నీ ఉన్నా తినడానికి మనసు రాని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులు, గాలులు, చిన్నచిన్న వర్షాల వల్ల మానసిక ధైర్యాన్ని కూడా కొద్ది కొద్దిగా కోల్పోతున్నారు.

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, సభ్య సమాజం మనకందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు అండగా ఉండాలి. రైతాంగం కూడా ఒకరికొకరు చేయి కలిపి ఐక్యమై ఆందోళనే ఆయుధంగా పోరాడాలి. ఢిల్లీ రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో ఐక్యంగా కదిలి నల్ల బర్లీ పొగాకు కనీసం గత సంవత్సరం రేటయినా సాధించుకోవాలి. ఆందోళన పోరాటాలలో రైతులు, కౌలు రైతులు పాల్గొని ప్రభుత్వాల మొండితనాన్ని, కంపెనీల దోపిడిని ఎదుర్కోవటానికి పోరాటమే పరిష్కారంగా ముందుకు రావాలి.

/ వ్యాసకర్త ఎ.పి కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి /



బిఆర్‌టిఎస్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

బడా కంపెనీల యాప్‌లను రద్దు చేయాలి

- ఆటో కార్మికుల నిరసనలో బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ

ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి బడా కంపెనీల యాప్‌లను రద్దు చేయాలని, ఆటో రంగాన్ని కాపాడాలని కోరుతూ విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ వద్ద విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం ఆటో కార్మికులు తమ ఆటోలతో నిరసన తెలిపారు. తొలుత భానునగర్ వద్ద నుంచి ఫుడ్ జంక్షన్ వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి బడా కంపెనీల యాప్‌లను రద్దు చేసి, ప్రభుత్వ ఆధీనంలోనే ఉచిత యాప్‌లను ఏర్పాటు చేయాలని, అధిక జరిమానాలు విధించే జిఒ నెంబర్ 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేరళ రాష్ట్రంలో స్వయంగా ప్రభుత్వమే యాప్‌లను ఏర్పాటు చేసి ఆటో కార్మికుల సంక్షేమాన్ని అమలు చేస్తుంటే మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

- మాజీ ఎమ్మెల్సీలు కె.ఎస్ లక్ష్మణరావు, విఠపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-నెల్లూరు

వక్ఫ్ చట్ట సవరణ ముస్లిములకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా ఉందని మాజీ ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించి వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 'వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి' అంటూ నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన జిల్లా స్థాయి సదస్సు మంగళవారం నిర్వహించారు.

లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ మాదాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సదస్సులో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. దేశ ప్రజలందరి ప్రయోజనాలను కాపాడే విధంగా రాజ్యాంగ రచన జరిగిందని తెలిపారు. రాజ్యాంగానికి మౌలిక స్వరూపం ఉందని, దానిని మార్చే హక్కు ఎవరికీలేదని ఉన్నత న్యాయస్థానం తీర్పును వెల్లడించిందని గుర్తు చేశారు. దేశ ప్రజల మధ్య ఐఖ్యతను విచ్ఛిన్నం చేయాలని బిజెపి కుట్ర పూరితంగా వ్యవహరించి ఇటువంటి వాటికి నాంది పలకడం దురదృష్టకమని అన్నారు. విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ప్రజల ఐక్యతకు భగం కలిగించే విధంగా ఉన్న వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇలియాజ్, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ నాయకులు సిరాజ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి నాయకులు సాగర్, ఆవాజ్ కమిటీ కార్యదర్శి రషీద్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో టాపర్ తెనాలి బాలిక

- రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్

ప్రజాశక్తి- తెనాలి (గుంటూరు జిల్లా)



తెలంగాణ ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్‌కు చెందిన యంద్రపాటి గ్రేసీ మాణిక్య చోజన్ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది హైదరాబాద్ కోహిడా ప్రాంతంలోని నారాయణ ఐఎఎస్ అకాడమీలో చేరిన ఆ విద్యార్థిని ఇంటర్లో హిస్టరీ, జియోగ్రఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (హెచ్.జి.పి) గ్రూపు తీసుకుంది. మొదటి సంవత్సరంలో 475 మార్కులకు 468, సెకండ్ ఇయర్‌లో 475 మార్కులకు 470 మార్కులు, ప్రాక్టికల్స్‌లో 50 మార్కులకు 49 మార్కులు సాధించింది. మొత్తం వెయ్యి మార్కులకు 987 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆ విద్యార్థిని తండ్రి యంద్రపాటి రాజేష్ డిఆర్‌డిఎలో పనిచేస్తూ కోవిడ్ సమయంలో మృతి చెందారు. తల్లి యంద్రపాటి పుష్పలత ప్రస్తుతం గుంటూరు కార్పొరేషన్ కొరిటిపాడు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. కుమార్తె విజయం పట్ల ఆమె కుటుంబ సభ్యులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు.

రొయ్యల పరిశ్రమలో అమ్మోనియం గ్యాస్ లీక్

- ముగ్గురు కార్మికులకు అస్వస్థత
- మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి భీమవరం

పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం మోగల్లులోని ఓ రొయ్యల పరిశ్రమలో మంగళవారం రాత్రి అమ్మోనియం గ్యాస్ లీకై. ముగ్గురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ప్రమాద స్థలం నుంచి బయటకు పరుగుపెట్టిన క్రమంలో కింద పడిపోయి మరో ఇద్దరు కార్మికులు గాయాలపాలయ్యారు. తోటి కార్మికుల కథనం ప్రకారం... ఫీజర్ కూలింగ్ అవ్వడానికి అమ్మోనియం గ్యాస్ పంపుతున్న సమయంలో గ్యాస్ పైప్ ఒక్కసారిగా పగిలిపోయింది.

దీంతో అక్కడ పని చేస్తున్న కార్మికులంతా భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ సమయంలో ఇద్దరు కార్మికులు కింద పడిపోవడంతో వారి తలకు బలమైన గాయాలయ్యాయి. మరో ముగ్గురు కార్మికులు అమ్మోనియం గ్యాస్ పీల్చడంతో స్పృహ తప్పారు. పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు, తోటి కార్మికులు వారిని భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఒక కార్మికుని పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. అస్సాంకు చెందిన ముగ్గురు కార్మికులు, పశ్చిమబెంగాల్, ఒడిశ్శాకు ఇద్దరు కార్మికులు ప్రమాదం బారిన పడినట్లు తెలిసింది. ఈ ఘటనపై పాలకోడేరు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతానికి ఎటువంటి కేసూ నమోదు చేయలేదని వారు తెలిపారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు : మంత్రి సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి కూటమి పాలనలో గతంలో ఎన్నడూ చూడని ప్రగతి, సంక్షేమం కొనసాగుతుండటంతో వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడుపు మండుతోందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక ఆడపిల్లను వేధించిన అధికారులను వెనకేసుకొస్తున్నారని, కూటమి ప్రభుత్వంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసినవారు పిఎస్ఆర్ అయినా, పెద్దిరెడ్డి అయినా శిక్ష తప్పదని మంత్రి పేర్కొన్నారు. తప్పుడు కేసులు, తప్పుడు సాక్ష్యాలు సృష్టించడంపై గతంలో అనేకసార్లు కోర్టులు గతంలో మీ ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు.

వైసిపి మహిళా నేత కృష్ణవేణికి రిమాండ్

- ప్రధాని మోడీ, చంద్రబాబులపై 'ఎక్స్'లో పోస్టింగ్‌లకు పలు సెక్షన్లతో కేసు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా


కోర్టు వద్ద వైసిపి నేత కృష్ణవేణి

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారనే కేసులో పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన వైసిపి మహిళా నాయకురాలు పాలేటి కృష్ణవేణికి నరసరావుపేట కోర్టు వచ్చే నెల 5వ తేదీ వరకూ రిమాండ్ విధించింది. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 11న నరసరావుపేటలో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటాలను చెప్పులతో కొట్టినట్లు 'ఎక్స్'లో కృష్ణవేని అసత్య సమాచారాన్ని పోస్ట్ చేసినట్టు నరసరావుపేటకు చెందిన రేషన్ డీలర్ విష్ణు నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో, నరసరావుపేట వన్ టౌన్ పోలీసులు ఆమెపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 196 (1), 352, 353(2), 336(3), 336(4), 340(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ సెక్షన్ 69 కింద కేసు నమోదు చేశారు. సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే ప్రచారం, అవమానకర వ్యాఖ్యలు, డిజిటల్ వేదికల దుర్వినియోగం కింద కేసు పెట్టారు. పిటి (ప్రిజనర్ ట్రాన్సిట్) వారెంట్‌పై ఆమెను హైదరాబాద్ నుంచి మంగళవారం తీసుకొచ్చి, నరసరావుపేట కోర్టులో హాజరు పర్చారు. కోర్టు ఆమెకు 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

5న పొగాకు రైతుల 'చలో సిఎం కార్యాలయం'

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో పండిన బర్లీ పొగాకును వెంటనే కంపెనీలతో కొనుగోలు చేయించాలని, క్వింటాలుకు రూ.18 వేలు చెల్లించాలని కోరుతూ మే 5న 'చలో ముఖ్యమంత్రి కార్యాలయం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ తీర్మానించింది. గుంటూరులోని మల్లయ్యలింగం భవన్‌లో ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు అధ్యక్షతన జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో వివిధ రైతు సంఘాల నాయకులు పాల్గొని వైట్ బర్లీ, నల్ల బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గతేడాది క్వింటాలు పొగాకు రూ.18 వేలకు కొనుగోలు చేశారని, ఈ ఏడాది రూ.4 వేల నుండి రూ.5 వేలకు మించి కొనుగోలు చేయడంలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పొగాకు కంపెనీలను సంప్రదించి గత సంవత్సరం కొనుగోలు చేసిన ధరకు బర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 9 జిల్లాల్లో మూడు లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేసిన పొగాకులో గణనీయమైన సంఖ్యలో బర్లీ పొగాకు ఉందన్నారు. ఐటిసి, జిపిఐ, అలయన్స్, దక్కను లాంటి కంపెనీలు రైతులకు సీడ్ ఇచ్చాయని, పండించిన పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి ప్రోత్సహించాయని తెలిపారు. రైతులు ఎకరానికి రూ.1.65 లక్షల పెట్టుబడి పెట్టారని, పంట మార్కెట్‌కు వచ్చే సమయానికి ప్రోత్సహించిన కంపెనీలు మొహం చాటు వేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, బర్లీ పొగాకును టుబాకో బోర్డు పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 25వ తేదీలోపు సదస్సులు జరిపి, ఉద్యమానికి సిద్ధం కావాలని, 30వ తేదీ లోపు ఎంపిలు, ఎమ్మెల్యేలకు, కంపెనీలకు వినతిపత్రాలు అందించాలని, మే 5న చలో సిఎం కార్యక్రమం నిర్వహించి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, వివిధ సంఘాల నాయకులు కంచుమాటి అజయ్, ఎం.వెంకటరెడ్డి, తోట ఆంజనేయులు, మన్నవ హరిప్రసాద్ జి.ఈశ్వరయ్య, పి.జమలయ్య, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కెప్టెన్ల సమస్యలు పరిష్కరించాలి

- తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పథకంలో పనిచేస్తున్న కెప్టెన్‌లకు వేతనాలు పెంచాలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్‌కు యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు ఎం బసవరాజు, ప్రధాన కార్యదర్శి ఎన్ దేవి ప్రసాద్ మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పథకంలో 500 వాహనాలకు 500 మంది కెప్టెన్లుగా పనిచేస్తున్నారని, వీరంతా అరబిందో (ఎఇఎంస్) సంస్థ రాష్ట్ర ప్రభుత్వ వైద్యారోగ్యశాఖకు సేవలందిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కెప్టెన్లకు నెలకు రూ.18,500 వేతనం చెల్లించాలని, పిఎఫ్ వాటా, ఇఎస్ఐ యాజమాన్యమే చెల్లించాలన్నారు. వారాంతపు, పండగ, జాతీయ సెలవు దినాలు అమలు చేయాలని కోరారు. విధి నిర్వహణకు అవసరమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలని, ప్రతి నెలా మొబైల్ రీఛార్జి మొత్తం చెల్లించాలన్నారు. హైరిస్క్ ప్రెగ్నెంట్ ఉమెన్, సివియర్ ఎనీమిక్ ప్రెగ్నెంట్ ఉమెన్ సేవలకు అదనపు వేతనం చెల్లించాలని కోరారు. ప్రమాదాల్లో మరణించిన కెప్టెన్లకు ఆరోగ్య బీమా, ఎక్స్‌గ్రేషియా, బీమా సౌకర్యాలు కల్పించాలని, గతంలో ఉన్న విధంగా కనీసం రూ.7 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, దహన సంస్కారాలకు ఖర్చులు అందించాలని కోరారు. అలాగే 8 గంటల పని విధానం, వాహనాల మరమ్మతులు వెంటనే చేపట్టడం, మరమ్మతులకు అయ్యే ఖర్చు యాజమాన్యం ముందుగానే చెల్లించాలని కోరారు. కెప్టెన్లను ఆప్‌కాస్‌లో చేర్చాలన్నారు. అవసరమైన ఇంప్రెస్ క్యాష్ కెప్టెన్‌ల వద్ద ఉంచాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాల రిపేర్లు యాజమాన్యమే భరించాలని కోరారు. వాహనాల సంఖ్యను బట్టీ అదనపు, బఫర్ సిబ్బందిని నియమించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. 15 జిల్లాల్లో 45 వాహనాలు మరమ్మతులకు లోనయ్యాయని, వీటికి అవసరమైన రిపేర్లు వెంటనే చేయించి ప్రజలకు సేవలందించే చర్యలు చేపట్టాలని కోరారు. అరబిందో సంస్థ యాజమాన్యం మారుతున్న నేపథ్యంలో ఉద్యోగుల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- ఎపి చెరకు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


షుగర్ కేన్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాష్ట్రంలో చెరకు పంటను ప్రోత్సహించడానికి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ చెరకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ షుగర్ కేన్ వెంకటరావును, చెరకు రైతుల సంఘం నాయకులు ముద్రాపు సూర్యనారాయణ, మాజీ ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో 29 చక్కెర పరిశ్రమలు ఉండగా, ప్రస్తుతం 25 మూతపడినట్లు తెలిపారు. 4 పరిశ్రమలు మాత్రమే 2024-25 క్రషింగ్ సీజన్‌కు పని చేశాయన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఉన్న 10 కో-ఆపరేటివ్ చక్కెర కర్మాగారాల్లో 9 మూతపడినట్లు తెలిపారు. వీటిలో 6 పరిశ్రమలు తెరిపించడానికి ప్రభుత్వం నిపుణుల, మంత్రుల కమిటీలను వేసిందన్నారు. ఈ కమిటీ నివేదికలు బయటపెట్టలేదన్నారు.

విద్యుత్ రంగంలో సంస్కరణల అమలు అవశ్యం

- కేంద్ర ఇంధనశాఖ సహాయమంత్రి శ్రీపాద యశోనాయక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ రంగంలో పంపిణీ సంస్థల ఆర్థిక పరిస్థితి, ఇతర సమస్యలను అధిగమించడానికి సంస్కరణలు అమలు ఆవశ్యకమని కేంద్ర ఇంధనశాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ పేర్కొన్నారు. విద్యుత్ సంస్కరణలపై విద్యుత్‌శాఖ మంత్రుల 4వ సమావేశం విజయవాడలోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యశో నాయక్ మాట్లాడుతూ.. టారిఫ్‌ల సమీక్షతో పాటు ఎపిటిఇఎల్ వంటి సంస్థలను బలోపేతం చేయడం, టారిఫ్ ఆర్డర్లు, నెట్ మీటరింగ్ విధానాలను సరళీకృతం చేయడం వంటి చర్యలతో డిస్కమ్‌లను నష్టాల నుంచి గట్టెక్కించవచ్చని సూచించారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ విధానం విస్తరణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. డిస్కమ్‌లను ఆర్థికంగా పరిపుష్టంగా చేసేందుకు, సుస్థిరాభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. రాజస్థాన్ విద్యుత్‌శాఖ మంత్రి హీరా లాల్ నగర్ మాట్లాడుతూ.. రాజస్థాన్‌లో పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 36,700 మెగావాట్ల రూఫ్ టాప్ సోలార్ సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 77 లక్షల మంది వినియోగదారులకు నెలకు 150 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మహారాష్ట్ర మంత్రి మేఘన దీపక్ సకోరే బోర్డికర్ మాట్లాడుతూ.. మహావితరణ సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందన్నారు. ఉత్తర ప్రదేశ్ విద్యుత్‌శాఖ మంత్రి అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. అధిక ఉత్పత్తి ఖర్చులను తగ్గించాలని, బొగ్గు కేటాయింపులను సరైన కార్యాచరణ ప్రకారం చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ఎంపిపిసిఎల్ ఎమ్‌డి అవినాష్ లావానియా, ఎఐడిఎ డిజి అలోక్ కుమార్, కేంద్ర ఇంధనశాఖ సంచాలకులు ప్రణవ్ తయల్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇడి అలీషా, ఎపి ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరి, ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి ఎకెవి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలకు వ్యక్తిగత గరిష్ట పరిధి కోసం పిల్

ప్రజాశక్తి-అమరావతి

మద్యం అమ్మకాలకు వ్యక్తిగత గరిష్ట పరిధి ఉండేలా చేయాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఒక నెలలో గరిష్టంగా విక్రయించే మద్యం బాటిళ్ల అమ్మకాలకు పరిమితిని విధించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని, మద్యం విక్రయాలన్నింటినీ ఆధార్‌తో అనుసంధానం చేసేలా ఉత్తర్వులివ్వాలని పిల్‌లో కోరారు. ఈ మేరకు విశాఖపట్నంకు చెందిన వైద్యులు డాక్టర్ షిరిన్ రహ్మాన్ పిల్ వేశారు. మద్యాన్ని 21 ఏళ్ల లోపు వారు కొనుగోలు చేయకుండా నియంత్రించాలన్నారు. సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వశాఖ మార్గదర్శకాల మేర జిల్లా, రాష్ట్ర స్థాయి నషా ముక్తి కమిటీలను ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇందులో ఎక్సైజ్‌శాఖ కార్యదర్శి, కమిషన్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని ప్రతివాదులుగా చేశారు.

మూర్తి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు : హైకోర్టు ఆదేశం

సీనియర్ ఐఎఎస్ ఆర్‌పి సిసోడియా ఓఎస్‌డిగా పనిచేసిన రిటైర్డు అటవీశాఖ అధికారి ఎంవివిఎస్ఎన్ మూర్తి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించరాదని, ఈ విషయంలో జోక్యం చేసుకోరాదని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఇంటెలిజెన్స్ అధికారులకిచ్చిన వాంగ్మూలాన్ని ఉపసంహరించుకోవాలని మూర్తిని ఒత్తిడి చేయొద్దని చెప్పింది. ఈ మేరకు విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్, మాచవరం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలను ఆదేశిస్తూ జస్టిస్ హరినాథ్ మంగళవారం ఆదేశాలిచ్చారు. సిసోడియా సూచనల మేరకు ఆయన మనుషులు తనను కిడ్నాప్ చేశారని, దీనిపై విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్, మాచవరం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలకు తానిచ్చిన వాంగ్మూలాన్ని వాపస్ తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారంటూ మూర్తి పిటిషన్ వేశారు. గత ఫిబ్రవరి 27న సిసోడియా మనుషులు తనను కిడ్నాప్ చేశారన్నారు. దీనిపై హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

నియోజకవర్గాల్లో ఇకపై శుక్రవారం గ్రీవెన్స్

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతి బుధవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల అభ్యర్థన మేరకు శుక్రవారానికి మార్చినట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గాల్లో స్వీకరించిన వినతులను, అలాగే పరిష్కరించిన సంఖ్య తర్వాత వారం నివేదికను టిడిపి కేంద్ర కార్యాలయానికి అందజేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశాల లక్ష్యం కార్యకర్తల సమస్యలు, ఫిర్యాదుల స్వీకరణ, పార్టీ సంస్థాగత నిర్మాణం, బలోపేతం, వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని అభినందించడమన్నారు. నియోజకవర్గంలో బూత్‌స్థాయి నుంచి సంస్థాగత పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ఈ సమావేశానికి తప్పనిసరిగా ఆహ్వానించాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. సమావేశం మినిట్స్‌ను కేంద్ర కార్యాలయానికి పంపించాలని, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

బెంగాల్, త్రిపురలో పుంజుకుంటాం

- సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి


మార్క్సిస్టు మహా యోధ లెనిన్ మహాశయుని విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ

కొల్‌కతా : తమ పార్టీ స్వతంత్రంగా బలం పుంజుకోవడంలోనూ, అలాగే దేశంలో వామపక్షాలు బలోపేతం కావడంలోనూ పశ్చిమ బెంగాల్ క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ చెప్పారు. వామపక్షాలకు, లౌకిక శక్తులకు బెంగాల్ ఆధునిక స్థావరమని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని వివిధ పార్టీలు చేరువ అయ్యాయని, వాటిపై ఓ పథకం ప్రకారం దాడి జరుగుతోందని అన్నారు. బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో సిపిఎం, వామపక్షాల ఎన్నికల పనితీరులో తగ్గుదల కన్పిస్తోందని అంగీకరిస్తూ దేశంలో నయా ఫాసిస్టు లక్షణాలు ప్రదర్శించే శక్తులతో పోరాడాలంటే సిపిఎంతో పాటు వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన సందర్భంగా ఆయన మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు లెనిన్ మహాశయుడి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలదండ వేసి బేబీ నివాళులర్పించారు. లెనిన్ మహనీయుని స్ఫూర్తిపథంలో దేశంలో వామపక్ష ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తామని ఆయన తెలిపారు. విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. రాజకీయ, సంస్థాగత లక్ష్యాలను పార్టీ రాష్ట్ర సమావేశాలలో నిర్దేశించుకుంటున్నామని చెప్పారు. ఈ లక్ష్యాల కారణంగా పార్టీ మళ్లీ పూర్వ వైభవం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీ ప్రాభవాన్ని పెంచేందుకు ప్రణాళికలు రూపొందించుకోవడంలో కేంద్ర కమిటీ సాయపడుతుందని తెలిపారు. వామపక్షాల ప్రభావం పెరగడం చాలా ముఖ్యమని అంటూ అది ఏ విధంగా ఇనుమడించి ఎన్నికల పోరాటాలలో ప్రతిబింబిస్తుందో చూడాల్సి ఉందని అన్నారు. సిపిఎం తిరిగి పూర్వ వైభవం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ అవసరమైన పక్షంలో దిద్దుబాటు చేసుకుంటామని చెప్పారు.

'మా ప్రతికూలతలను వినడానికి సైతం మేము సిద్ధమే. వాళ్లు చెప్పే దానిలో ఏదైనా విషయం ఉంటే మేము దిద్దుబాటు చర్యలు తీసుకుంటాం' అని బేబీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం, వామపక్షాలు సరైన దారిలోనే వెళుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకల కారణంగా 26 వేల మంది పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఉద్యోగాలు కోల్పోవడానికి తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆర్‌జీ కార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై బెంగాల్ ప్రజలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారని ఆయన గుర్తు చేశారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ముర్షిదాబాద్ జిల్లాలో ఇటీవల జరిగిన అల్లర్లను ప్రస్తావిస్తూ రాష్ట్రంలో మతతత్వ శక్తులు కూడా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

బ్రిగేడ్ పెరేడ్ గ్రౌండ్స్‌లో సిపిఎం, ప్రజా సంఘాలు మెగా ర్యాలీని నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎర్ర జెండాలు చేబూనిన అశేష జనవాహినితో మైదానం నిండిపోయిందని చెప్పారు.

గ్రామీణ, పట్టణ పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలని మదురైలో జరిగిన 24వ పార్టీ మహాసభలు కమ్యూనిస్టు సంఘాలకు, రైతు-కార్మిక సంఘాలకు పిలుపునిచ్చిందని బేబి తెలిపారు. 'పార్టీ మహాసభలు ముగిసిన వెంటనే బెంగాల్‌లో జరిగిన ప్రజాస్వామిక ఉద్యమాన్ని గమనిస్తే సిపిఎం ఇచ్చిన పిలుపును చిత్తశుద్ధితో, విజయవంతంగా ఏ విధంగా అమలు చేసారో అర్థమవుతుంది' అని అన్నారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగానికి విరుద్ధమని విమర్శించారు. మత, భాషారమైన మైనారిటీలకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తోందని బేబి తెలిపారు.

తమిళనాడు తీర్పు కేరళకు వర్తించదట!

- సుప్రీంకోర్టులో కేంద్రం వింత వాదన

న్యూఢిల్లీ : పెండింగ్‌లో వున్న రాష్ట్ర బిల్లులపై మూడు మాసాల్లోగా గవర్నర్లు, భారత రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలని పేర్కొంటూ తమిళనాడు దాఖలు చేసిన కేసులో ఈ నెల 8న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పొరుగు రాష్ట్రమైన కేరళకు వర్తించదని కేంద్రం సర్వోన్నత న్యాయస్థానంలో వింత వాదన వినిపించింది. ఈ మేరకు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాలు మంగళవారం జస్టిస్ పి.ఎస్.నరసింహా, జస్టిస్ జోమాల్యా బగ్చిలతో కూడిన సుప్రీం బెంచ్‌కు తెలియచేశారు. తమిళనాడు అసెంబ్లీ రెండోసారి ఆమోదించి పంపిన 10 బిల్లులకు తన ఆమోదాన్ని తెలియచేయడంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి వల్ల కలిగిన ఆలస్యంపై ప్రభుత్వం వేసిన కేసులోని అంశాలు, వాస్తవాలు కేరళకు వర్తించవని వారు పేర్కొన్నారు. ఆ తీర్పును ప్రభుత్వం ఇంకా అధ్యయనం చేస్తోందని అంటూ మెహతా వాయిదాను కోరారు. ఈ రెండు రాష్ట్రాల కేసుల్లోని తేడా 'ముఖ్యంగా వాస్తవాల్లోనే (ఫ్యాక్ట్స్)' వుందని వెంకటరమణి పేర్కొన్నారు. దీనిపై సీనియర్ న్యాయవాది కె.కె.వేణుగోపాల్, న్యాయవాది సి.కె.శశి మాట్లాడుతూ, ఏప్రిల్ 8నాటి తీర్పు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుందని చెప్పారు. కేరళ గవర్నర్ సుప్రీం కోర్టు విధించిన గడువుకు కట్టుబడి వున్నారా లేదా అనేది మాత్రమే కేంద్రం కోర్టులో చెప్పాల్సి వుంటుందన్నారు. దీనిపై సవివరమైన విచారణను మే 6వ తేదీన జరుపుతామని జస్టిస్ నరసింహా ప్రకటించారు. మొత్తంగా ఈ అంశాన్ని ముఖ్యంగా తమిళనాడు గవర్నర్ కేసులోని తీర్పు కేరళకు వర్తిస్తుందా లేదా అనే విషయాన్ని కోర్టు పరిశీలిస్తుందని చెప్పారు.

జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడి

(మొదటి పేజీ తరువాయి)

వినిపించడంతో వెంటనే అప్రమత్తమై భద్రతా బలగాలు అక్కడకు చేరుకున్నాయి. ఉగ్రవాదుల్ని అడ్డుకున్నాయి. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించాయి. దాడి ఘటన తెలియగానే జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి పహల్గాంకు బయలుదేరి వెళ్లారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే యూసుఫ్ తరిగామి ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రాష్ట్రపతి, ప్రధాని తదితరుల దిగ్భ్రాంతి

జమ్ముకాశ్మీర్‌లో చోటుచేసుకున్న ఉగ్రవాద దాడిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సిపిఎం తదితరులు దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. దాడిని క్రూరమైన, అమానీయ చర్యగా పేర్కొన్నారు. దాడిని నిర్ద్వంద్వంగా ఖండిచాలని తెలిపారు. అమాయక పౌరులపై, ముఖ్యంగా పర్యాటకులపై దాడి చేయడం భయంకరమైనదని, క్షమించరానిదని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారు వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విదేశీ పర్యటనలో ఉన్న మోడీ సోషల్ మీడియాలో స్పందించారు. ఉగ్రదాడిని ఖండిస్తూ, ఈ దారుణమైన చర్య వెనుక ఉన్నవారిని చట్టం ముందు నిలబెడతామని ప్రకటించారు. ఈ దారుణ ఘటనపై కేంద్ర మంత్రి హోం మంత్రి అమిత్‌షాతో ఫోన్‌లో మాట్లాడి మోడీ వివరాలు తెలుసుకున్నారు.

సిపిఎం ఖండన

పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఒక ప్రకటన పోస్టు చేసింది. క్షతగాత్రులు శీఘ్రంగా కోలుకుకోవాలని సిపిఎం ఆకాంక్షించింది. అత్యంత హేయమైన, హింసాత్మకమైన ఈ దాడికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించేలా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు భరోసా కల్పించాలని పేర్కొంది. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరింది. 'కాశ్మీర్‌లో అంతా బాగుంది..శాంతిభద్రతలను భేషుగ్గా పునరుద్ధరించాం' అంటూ ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేస్తున్న ప్రచారమంటూ పచ్చి బూటకమని ఈ ఉగ్రవాద దాడి తెలియజేస్తోందని సిపిఎం పేర్కొంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సమయాన్ని వృధా చేయకుండా జమ్ముకాశ్మీర్ ప్రజల సమస్యలకు రాజకీయ పరిష్కారం చూపాలని డిమాండ్ చేసింది.

పిరికిపంద చర్య : మెహబూబా ముఫ్తీ

పహల్గామ్‌లో పర్యాటకులపై దాడి పిరికిపంద చర్య అని జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. ఇటువంటి హింస ఆమోదయోగ్యం కాదని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

అమానవీయ దాడి : తరిగామి

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, కుల్గాం ఎమ్మెల్యే ఎం.వై. తరిగామి తీవ్రంగా ఖండించారు. ఇది అమానవీయ దాడి అని, పిరికిపందల చర్య అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి హింసను తీవ్రంగా ఖండించాలని తెలిపారు. ఇలాంటి దాడులు తీవ్రంగా బాధ కలిగిస్తాయని, ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. 'హింసకు ఎటువంటి ప్రయోజనం లేదు. ఇలాంటి హింసను అన్ని వైపుల నుంచి ఖండించాలి. అమాయక పౌరులపై ఇటువంటి పిరికిదాడులకు నాగరిక సమాజంలోనూ స్థానం లేదు. నేరస్తులను గుర్తించి బాధితులకు వేగంగా న్యాయం చేయాలి' అని తరిగామి తెలిపారు.

కోరలు చాచిన ఉగ్రవాదం

జమ్మూకాశ్మీర్‌లో ఇటీవల ఉగ్రదాడులు క్రమంగా పెరుగుతున్నాయి. జమ్మూకాశ్మీర్‌లో పరిస్థితి ప్రశాంతంగా ఉందని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చెబుతున్నా.. అక్కడ పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. తాజా దాడి మరింత ఆందోళన కలిగిస్తుంది. మంగళవారం దాడి జరిగిన పహల్గాం ప్రాంతం ప్రఖ్యాత అమర్‌నాథ్ యాత్రా మార్గంలోనే ఉంది. ఈ నేపథ్యంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడటం ఆందోళన కలిగిస్తోంది.

ఉగ్ర ఘాతుకం వెనుక..?

కాశ్మీర్‌లో కొంతకాలం నుంచి పర్యాటకుల తాకిడి పెరిగిన నేపథ్యంలో ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు భద్రతాదళాలు భావిస్తున్నాయి. పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న లష్కర్-ఎ-తోయిబా ఉగ్రవాద సంస్థ స్థానిక శాఖ రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ దాడికి తెగబడినట్టు ప్రకటించుకుంది.

విద్యార్థుల సస్పెన్షన్లు రద్దు చేయాలి : జయతీ ఘోష్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలోని అంబేద్కర్ యూనివర్శిటీ (ఎయుడి) విద్యార్థుల ఆందోళనకు ప్రొఫెసర్లు మద్దతు ప్రకటించారు.

ఐదుగురు విద్యార్థులపై అక్రమ సస్పెన్షన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా(పిసిఐ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనివర్శిటీ ఆఫ్ మసాచుసెట్స్ అమ్హెర్స్ట్ (అమెరికా) ప్రొఫెసర్ జయంతి ఘోష్ మాట్లాడుతూ ప్రశ్నించిన విద్యార్థులను సస్పెండ్ చేయడమంటే, వారి భావప్రకటన స్వేచ్ఛపై దాడి చేయడమే అని అన్నారు. ఈ ప్రభుత్వం విద్యాలయాల్లో ప్రజాస్వామ్య వాతావరణాన్ని విచ్ఛిన్నం చేసి, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. ఎయుడి అధికారులు క్యాంపస్‌లో సాధారణ స్థితిని పునరుద్ధరించాలని, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టాలని సూచించారు. సమస్యను పరిష్కరించే బదులు ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారని సస్పెండ్‌కు గురైన విద్యార్థులు విమర్శించారు. సస్పెన్షన్లను వెంటనే రద్దు చేయాలి, కరంపుర క్యాంపస్ ప్రధాన ద్వారం పునఃప్రారంభించాలని, అన్ని అంతర్గత బారికేడ్లను తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సంఘీభావం తెలిపినందుకు అధ్యాపకుడు డాక్టర్ కౌస్తవ్ బెనర్జీకి జారీ చేసిన షోకాజ్ నోటీసును రద్దు చేయాలని, నిరసనలను నిషేధిస్తూ జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ విలేకర్ల సమావేశంలో ప్రొఫెసర్ అపూర్వానంద్ (యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీ), ప్రొఫెసర్ రవీంద్రన్ గోపీనాథన్ (జామియా మిలియా ఇస్లామియా యూనివర్శిటీ), డాక్టర్ ప్రదీప్ కె షిండే (జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్), ప్రొఫెసర్ అభా దేవ్ హబీబ్ (ఢిల్లీ యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్), రోనక్ ఖత్రి (ప్రెసిడెంట్ ఢిల్లీ యూనివర్శిటీ స్టూడెంట్స్ యూనియన్), అంబేద్కర్ యూనివర్శిటీ ఢిల్లీ విద్యార్థి సంఘం, అంబేద్కర్ యూనివర్శిటీ ఢిల్లీ స్టూడెంట్స్ కౌన్సిల్, కాశ్మీరీ గేట్ (ఎయుడిఎస్‌సి-కెజి) నేతలు ఉన్నారు.

'షర్బత్ జిహాద్' పోస్టులను తొలగిస్తాం : బాబా రాందేవ్

న్యూఢిల్లీ : ప్రజాదరణ పొందిన రూహ్ అఫ్జా పానీయంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తాను పెట్టిన వీడియోలు, సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు యోగా గురువు బాబా రాందేవ్ మంగళవారం అంగీకరించారు. రూహ్ అఫ్జాను లక్ష్యంగా చేసుకొని బాబా రాందేవ్ చేసిన 'షర్బత్ జిహాద్' వ్యాఖ్యలపై ఢిల్లీ హైకోర్టు మండిపడిన విషయం తెలిసిందే. రాందేవ్ వ్యాఖ్యలు సమర్థనీయం కావని, దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో వివాదాస్పద వీడియోలు, పోస్టులను వెంటనే తొలగించేందుకు పతంజలి సంస్థ అంగీకరించింది. ఈ విషయాన్ని రాందేవ్ న్యాయవాది ఢిల్లీ హైకోర్టుకు తెలియజేశారు.

రాందేవ్ వ్యాఖ్యలపై రూహ్ అఫ్జా పానీయం ఉత్పత్తిదారు హమ్‌దర్ద్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు విచారణ జరుపుతోంది.

పిఎస్‌ఆర్ ఆంజనేయులు అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

అరెస్ట్ చేసే సమయంలో అరెస్ట్ చేసిన ఐపిఎస్ అధికారితో నడిపిన ఫోన్ సంభాషణలు, వైసిపి ప్రజాప్రతినిధుల ఫోన్ టాంపరింగ్ ఆరోపణలపై కూడా విచారణలో అడిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న కాంతిరాణా టాటా, విశాల్ గున్నీలను కూడా త్వరలోనే అరెస్ట్ చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. మంగళవారం రాత్రికి సిఐడి కార్యాలయంలోనే పిఎస్‌ఆర్ ఆంజనేయులను ఉంచారు. బుధవారం ఉదయం కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. జత్వానీ కేసుతో పాటు ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజును కస్టోడియల్ టార్చర్ కేసు కూడా పిఎస్‌ఆర్ ఆంజనేయులుపై ఉంది. ఉద్యోగ సంఘ నేత కెఆర్ సూర్యనారాయణను గతంలో బెదిరించిన సంఘటనపై , అప్పట్లో డిజిపికి ఉద్యోగ సంఘ నేత ఫిర్యాదు చేశారు. ఆ కేసు దర్యాప్తును గుంటూరు సిఐడి అధికారులు విచారిస్తున్నారు.

సివిల్స్‌లో సత్తా చాటిన మహిళలు


శక్తి దూబే


హర్షిత గోయల్

న్యూఢిల్లీ : అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) నిర్వహించిన సివిల్స్ - 2024 తుది ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో మహిళా అభ్యర్థులు సత్తా చాటారు. ప్రథమ, ద్వితీయ ర్యాంకులతో పాటు టాప్ 5 ర్యాంకుల్లో ముగ్గురు, టాప్ 25 ర్యాంకుల్లో 11 మంది మహిళలే జయకేతనం ఎగురవేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన పలువురు విద్యార్థులు కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. గతేడాది జూన్ 16న జరిగిన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు దేశ వ్యాప్తంగా 9,92,599 మంది దరఖాస్తు చేసుకోగా.. 5,83,213 మంది మాత్రమే పరీక్ష రాశారు. వీరిలో సెప్టెంబర్‌లో జరిగిన మెయిన్స్ రాత పరీక్షకు 14,627 మంది ఉత్తీర్ణత సాధించగా..వీరిలో వ్యక్తిగతంగా మౌఖిక పరీక్షకు 2,845 మంది ఎంపికయ్యారు. తుది ఫలితాల్లో 1,009 మంది అభ్యర్థులను వివిధ సర్వీసుల్లో నియామకాలకు యుపిఎస్‌సి ప్రతిపాదించింది. వీరిలో 725 మంది పురుషులు కాగా, 284 మంది మహిళలు ఉన్నారు. వీరిలో జనరల్ కేటగిరీలో 335 మంది, ఇడబ్ల్యుఎస్ నుంచి 109, ఒబిసి నుంచి 318, ఎస్‌సి కేటగిరీలో 160, ఎస్‌టి కేటగిరీ నుంచి 87 మంది చొప్పున ఉన్నారు.

టాప్ -5 ర్యాంకర్లు వీరే..

ఈ ఏడాది సివిల్స్ తుది ఫలితాల్లో మహిళలు అదరగొట్టారు. ప్రథమ, ద్వితీయ ర్యాంకులతో పాటు టాప్ 5 ర్యాంకుల్లో ముగ్గురు, టాప్ 25 ర్యాంకుల్లో 11 మంది మహిళలు విజయదుందుబి మోగించారు. శక్తి దూబే ప్రథమ ర్యాంకుతో సత్తా చాటగా.. హర్షిత గోయల్ (2), అర్చిత్ పరాగ్ (3), షా మార్గి చిరాగ్(4), ఆకాశ్ గార్గ్ (5) ర్యాంకుల్లో మెరిశారు.

మెరిసిన తెలుగు తేజాలు

తెలుగు రాష్ట్రాల నుంచి సత్తా చాటిన విద్యార్థుల్లో ఇ.సాయి శివాని 11వ ర్యాంకుతో మెరిశారు. ఆమె వరంగల్‌లోని శివనగర్‌కు చెందిన రాజు, రజిత దంపతుల ప్రథమ పుత్రిక. ఇటీవల జరిగిన టిజిపిఎస్‌సి గ్రూప్ పరీక్షల్లో జోనల్‌వైజ్‌లోనూ 11వ ర్యాంకు సాధించిన సాయి శివాని.. సివిల్స్ ఫలితాల్లోనూ అదే ర్యాంకుతో సత్తా చాటడం విశేషం. అలాగే, సివిల్స్ ఫలితాల్లో బన్న వెంకటేశ్ 15వ ర్యాంకు సాధించారు. 2023లో సివిల్స్ ఫలితాల్లో 467వ ర్యాంకు సాధించిన వెంకటేశ్ ప్రస్తుతం.. హైదరాబాద్‌లో ఐపిఎస్ శిక్షణ తీసుకుంటున్నారు. మరోవైపు అభిషేక్ శర్మ 38, రావుల జయసింహారెడ్డి 46, శ్రవణ్‌కుమార్ రెడ్డి 62, సాయి చైతన్య జాదవ్ 68, ఎన్ చేతనరెడ్డి 110, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి 119, చల్లా పవన్ కల్యాణ్ 146, ఎన్.శ్రీకాంత్ రెడ్డి 151, నెల్లూరు సాయితేజ 154, కొలిపాక శ్రీకృష్ణసాయి 190వ ర్యాంకులతో అదరగొట్టారు.

26న పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు

- నేటి నుండి ప్రజల సందర్శనార్థం బసిలికాలో భౌతిక కాయం
- అంత్యక్రియల్లోనూ ఆచారాలను ధిక్కరించి..



వాటికన్ : వాటికన్ : సోమవారం కన్నుమూసిన పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ఈ నెల 26న జరగనున్నాయి. బుధవారం నుండి ఆయన భౌతిక కాయాన్ని సెయింట్ పీటర్స్ బసిలికాలో ప్రజల సందర్శనార్థం వుంచనున్నట్లు వాటికన్ వర్గాలు తెలిపాయి. కాగా పోప్ అంత్యక్రియలకు పలు దేశాల నుండి నేతలు హాజరు కానున్నారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్, జర్మనీ ఛాన్సలర్ ఓల్ఫ్ షుల్జ్, ఫ్రాన్స్ అధ్యక్షులు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షులు లూలా డసిల్వా, ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్స్కీ, ఇయు చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లేయన్, యురోపియన్ కమిషన్, యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు సహా పలువురు అధినేతలు రానున్నారు. అంత్యక్రియలు జరిగే రోజు శనివారం జాతీయ సంతాప దినంగా పాటించనున్నట్లు పోలెండ్ ప్రకటించింది. తూర్పు తైమూర్ దేశం ఏడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. పోప్ మృతికి సంతాప సూచకంగా భారత్ మూడు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించింది. 22, 23 తేదీలతో పాటూ అంత్యక్రియలు జరిగే 26న సంతాప దినాలుగా పాటిస్తోంది.
తన అంత్యక్రియలు జరగడానికి రోమ్‌లోని నాలుగు ప్రధాన చర్చిల్లో ఒకటైన సెయింట్ మేరీ మేజర్‌ను ఎంపిక చేసుకోవడంలో కూడా పోప్ ఫ్రాన్సిస్ సంప్రదాయాన్ని ఛేదించారు. వాటికన్ సిటీ నుండి రోడ్డు మార్గాన రోమ్‌లోని సెవెన్ హిల్స్‌లో ఒకటైన ఎస్క్విలిన్ వరకు అంతిమ యాత్ర సాగుతుంది. పోప్ తన పదవికి ఒక మానవతా, వినయపూర్వకమైన కోణాన్ని ఇవ్వడానికి ఎల్లప్పుడూ పరితపించేవారు. ఆ స్ఫూర్తితోనే వాటికన్ సాంప్రదాయ వైభవాలను విడనాడి తన అంత్యక్రియల ప్రక్రియ, ఖననం అంతా కూడా సరళమైన ఆచార వ్యవహారాల్లో సాగాలని నిర్ణయించారు. ఆర్భాటాలేమీ లేకుండా సాదా సీదాగా తనను భూమిలో ఖననం చేయాలని ఆయన కోరారు. లాటిన్ భాషలో తన పేరును ఫ్రాన్సిస్కస్ అని మాత్రమే రాయించాలని సూచించారు.

పోప్ చివరి మాటలు

ఈస్టర్ సండే నాడు సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో వేచి వున్న వేలాదిమంది ప్రజలకు ఆశీర్వచనాలు అందచేసేందుకు బయటకు రావడానికి సహకరించిన తన నర్సుకు పోప్ థ్యాంక్యూ చెప్పారు. అవే ఆయన చివరి మాటలుగా మిగిలిపోయాయి. పోప్‌కు 24గంటలూ సేవలందించిన నర్సు మాసిమిలెనో స్ట్రాపెట్టిని ఉద్దేశించి "స్క్వేర్‌కు నన్ను తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు" అంటూ వ్యాఖ్యానించారు. ఈ మేరకు వాటికల్ అధికార వార్తా విభాగం మంగళవారం వెల్లడించింది.



సౌదీ అరేబియా పర్యటన కుదించుకున్న ప్రధాని మోడీ

జెడ్డా : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన సౌదీ అరేబియా పర్యటనను కుదించుకున్నారు. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సౌదీ యువరాజు బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు ప్రధాని నరేంద్ర మోడీ సౌదీ అరేబియాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం జెడ్డా చేరుకున్నారు. అయితే ఉగ్రదాడి వార్త తెలియడంతోనే మంగళవారం రాత్రే స్వదేశానికి తిరిగిబయలుదేరారు. కాగా, మంగళవారం ఉదయం మోడీ ప్రయాణిస్తున్న విమానం సౌదీ గగనతలంలోకి ప్రవేశించగానే సౌదీ యుద్ధ విమానాలు ఎస్కార్టుగా వస్తూ మోడీకి స్వాగతం పలికాయి. గత 40 ఏళ్లలో జెడ్డా నగరంలో పర్యటించిన తొలి భారత ప్రధాని మోడీనే. కాగా సౌదీలో పర్యటించడం మూడోసారి. జెడ్డాకు బయలుదేరడానికి ముందుగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, రక్షణ, వాణిజ్య, పెట్టుబడులు, ఇంధన రంగాలతో సహా ఇరు దేశాల మధ్య గణనీయమైన భాగస్వామ్యం వుండాలని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రాంతీయ శాంతి సుస్థిరతలు, భద్రత, సంక్షేమాన్ని పెంపొందించేందుకు ఇరు పక్షాలు కట్టుబడి వున్నాయని చెప్పారు. ఇరు దేశాల ప్రజల మధ్య కూడా సంబంధాలు పెంపొందాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.

ప్రపంచ వృద్ధి రేటు 2.8 శాతమే

- అంచనాలను భారీగా తగ్గించిన ఐఎంఎఫ్
- అమెరికా టారిఫ్‌ల ప్రభావమే కారణం
- భారత్ వృద్ధి రేటు అంచనా 6.2కు కుదింపు

వాషింగ్టన్ : ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటు మందగిస్తోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా కట్టింది. ఈ క్రమంలోనే ప్రపంచ వృద్ధి రేటును, భారత్ సహా వివిధ దేశాల వృద్ధి రేటు అంచనాలను గణనీయంగా తగ్గించింది. అంతర్జాతీయ వృద్ధిరేటు కూడా 2024లో అంచనా వేసిన 3.3 శాతం నుండి 2025లో 2.8 శాతానికి పడిపోతుందని పేర్కొంది. అంటే జనవరిలోని అంచనాల కన్నా 0.5 శాతం పాయింట్లు క్షీణించింది. 2026లో మూడు శాతం మేరా (అంటే జనవరిలోని అంచనాల కన్నా 0.3 శాతం పాయింట్లు తక్కువగా) కోలుకుంటుంది. దాదాపు అన్ని దేశాలకు సంబంధించి వృద్ధిరేటు అంచనాలు క్షీణించాయి. పెరుగుతున్న అనిశ్చితి, క్షీణిస్తున్న సెంటిమెంట్ వంటి కారణాల వల్ల కొత్తగా తీసుకునే వాణిజ్య చర్యల ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలు చాలా ప్రాంతాల్లో, దేశాల్లో ప్రతిబింబిస్తున్నాయని ఐఎంఎఫ్ పేర్కొంది.


30 బేసిస్ పాయింట్ల కోత

2026 ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధిరేటును 30 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.2 శాతం మేర వృద్ధి చెందగలదని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఇందుకు వాణిజ్య ఉద్రిక్తతలు అంతర్జాతీయ అస్థిరతలు, అనిశ్చుతులు కారణాలుగా పేర్కొంది. తాజాగా ప్రపంచ ఆర్థిక దృక్పథం (డబ్లుఇఓ) నివేదిక కూడా ఇవే అంశాలు పేర్కొంది. "భారత్‌కు సంబంధించినంతవరకు, 2025-26లో వృద్ధిరేటు సాపేక్షంగా 6.2శాతం వద్ద మరింత సుస్థిరంగా వుండగలదు. ప్రైవేటు వినిమయం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినిమయం ఇందుకు దోహదపడుతోంది. అయితే 2025 జనవరిలో అంచనా వేసిన దానికన్నా ఈ రేటు 0.3శాతం పాయింట్లు తక్కువగా వుంటుంది. వాణిజ్య ఉద్రిక్తతలు, అంతర్జాతీయ అనిశ్చితి అధిక స్థాయిలో నెలకొనడమే ఇందుకు కారణంగా వుంది." అని ఐఎంఎఫ్ పేర్కొంది. వాణిజ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లడంతో విధానపరమైన అసందిగ్ధత కూడా చాలా ఎక్కువగా వుందని డబ్ల్యుఇఓ నివేదిక పేర్కొంది.

ట్రంప్ టారిఫ్‌లు ప్రమాదకరం

- ముగిసిన స్వేచ్ఛా వాణిజ్య యుగం
- సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ఆందోళన
- ప్రపంచమంతా ఛీకొడుతున్నా..

అమెరికా భజనలోనే పరితపిస్తున్న మోడీ పరివారం



సింగపూర్ : అమెరికాలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా ఆయన మొహం మీదనే టారిఫ్‌లు తగ్గించే ప్రసక్తే లేదంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెగేసి చెప్పినా..మోడీలో ఇసుమంతైనా చలనం రాలేదు. అమెరికా చెప్పిన ప్రతిదానికీ ఊకొట్టడమే కాకుండా సుంకాలు ఆయా దేశాల విధానపర నిర్ణయాలంటూ అమెరికాను సమర్థించేందుకు కూడా బిజెపి నేతలు సిగ్గుపడింది లేదు. ఈ క్రమంలోనే అమెరికా ఉపాధ్యక్షులు వాన్స్‌తో పాటు ట్రంప్ మిత్రుడు, టెస్లా అధినేత ఎలన్ మస్క్‌ను భారత్‌కు ఆహ్వానించి మోడీ సర్కార్ అమెరికా భజనలో పరితపిస్తోంది. సింగపూర్ లాంటి చిన్నచిన్న దేశాల అధినేతల సైతం ట్రంప్ తీరును, అమెరికా నైజాన్ని కడిగిపారేస్తుండగా మోడీ సర్కార్ మాత్రం 'పెద్దన్న' పట్ల వినయవిధేయతలనే చాటుకోవడం సిగ్గుచేటు అని విమర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ఆ దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగం నుంచి మోడీ సర్కార్ ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని నెటిజన్లు హితవు పలుకుతున్నారు. అమెరికా తీరును ఎండగట్టిన లారెన్స్ ప్రసంగం ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. అందులో ఆయన ఏమన్నారంటే.. సుంకాలపై ట్రంప్ నిర్ణయాల ను ఆయన భూకంపంగా అభివర్ణించారు. సింగపూర్ వంటి చిన్న దేశాలను అణచివేసే నిర్ణయాలుగా వాటిని పేర్కొన్నారు. ఇక స్వేచ్ఛా వాణిజ్య యుగం ముగిసినట్లేనని పేర్కొన్నారు. " ట్రంప్ విధానం మరింత ఏకపక్ష, రక్షణాత్మక, ప్రమాదకరమైంది. మనం ఒక కొత్త దశలోకి ప్రవేశిస్తున్నాము. ఇంతకాలం సింగపూర్ 10 బేస్ టారిఫ్ శ్రేణీలో ఉంది.

దేశం వారీగా వారి స్వంత ఇష్టపడే నిబంధనలపై మాత్రమే వ్యాపారం చేయడం ద్వారా అన్ని దేశాలకు, ముఖ్యంగా సింగపూర్ వంటి చిన్న దేశాలకు ఇబ్బందిని కలిగిస్తుంది. ఇది పూర్తి స్థాయి ప్రపంచ వాణిజ్య యుద్ధానికి దారి తీస్తుంది. ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు.. కానీ ప్రమాదాల గురించి మనం స్పష్టంగా ఉండాలి. సింగపూర్ ప్రతీకార సుంకాలకు దూరంగా ఉంటుంది. కానీ ఇతర దేశాలు అదే సంయమనాన్ని చూపించకపోవచ్చు. మనకు ఒకప్పుడు తెలిసిన ప్రపంచ ప్రశాంతత. స్థిరత్వం తిరిగి రాదు." అని వాంగ్ పేర్కొన్నారు.

ప్రాజెక్టులకు సాయపడండి

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు బెంచ్ అంశంపై ఆయనతో చర్చించారు. బెంచ్ ఏర్పాటుకు అవసరమైన కార్యాచరణ అమలు చేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీల్లో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టిడిపి ఎంపిలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మందకృష్ణ మాదిగ

ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వర్గీకరణ నోటిఫికేషన్ వంటి అంశాలపై చర్చించారు. వర్గీకరణ వేగవంతం చేసినందుకు చంద్రబాబుకు మందకృష్ణ మాదిగ కతజ్ఞతలు తెలిపారు. చంద్రాబాబుతో భేటీకి ముందు అమిత్ షా, కిషన్ రెడ్డిలను మందకృష్ణ మాదిగ కలిశారు.

ట్రంప్ ప్రభుత్వంపై హార్వర్డ్ వర్సిటీ దావా

బోస్టన్ : తనకు రావాల్సిన 2.2 బిలియన్ డాలర్ల గ్రాంట్లను నిలిపివేస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హార్వర్డ్ యూనివర్సిటీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. రాజకీయ, సామాజిక మార్పుల కోసం క్యాంపస్‌లో నిర్వహించే ప్రచారాన్ని పరిమితం చేయాలంటూ ట్రంప్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను హార్వర్డ్ విశ్వవిద్యాలయం బేఖాతరు చేసింది. దీంతో దానికి ఇవ్వాల్సిన ప్రభుత్వ గ్రాంట్లను ట్రంప్ నిలిపివేశారు. యూనివర్సిటీలో ప్రభుత్వ, నాయకత్వ సంస్కరణలు చేపట్టాలని, ప్రవేశాలకు సంబంధించిన విధానాలలో మార్పులు చేయాలని సూచిస్తూ ఈ నెల ప్రారంభంలో ట్రంప్ ప్రభుత్వం హార్వర్డ్‌కు లేఖ రాసింది. కొన్ని విద్యార్థి సంఘాల గుర్తింపును నిలిపివేయాలని కూడా ఆదేశించింది. అయితే ప్రభుత్వ డిమాండ్లకు తలవంచబోమని హార్వర్డ్ అధ్యక్షుడు అలన్ గార్బర్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత కొద్ది గంటలకే ప్రభుత్వ నిధులను నిలిపివేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

'అమెరికా ప్రజల ప్రాణాలను కాపాడడం, అమెరికా విజయాలను ముందుకు తీసుకుపోవడం, అమెరికా భద్రతను పరిరక్షించడం, ఆవిష్కరణల విషయంలో ప్రపంచ నేతగా అమెరికా స్థానాన్ని సుస్థిరం చేయడమే లక్ష్యంగా యూదు వ్యతిరేక ఆందోళనలకు, అది స్తంభింపజేసిన వైద్య, శాస్త్ర, సాంకేతిక, ఇతర పరిశోధనలకు మధ్య ఉన్న హేతుబద్ధమైన సంబంధాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదు...గుర్తించలేకపోతోంది' అని బోస్టన్ ఫెడరల్ కోర్టులో వేసిన దావాలో హార్వర్డ్ యూనివర్సిటీ తెలియజేసింది. పరిశోధనలకు సంబంధించిన నిధులను నిలిపివేయడం ద్వారా హార్వర్డ్ కార్యక్రమాలను, ఆవిష్కరణలను, వాటి పురోగతిని ముందుకు తీసుకుపోవడంలో ఎదురయ్యే పరిణామాలను ప్రభుత్వం గుర్తించలేకపోతోందని పేర్కొంది.

నిరసనకారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అమెరికా విలువలను ద్వేషిస్తున్న అంతర్జాతీయ విద్యార్థులపై నిఘా వేయాలని ఈ నెల 11న రాసిన లేఖలో హార్వర్డ్‌కు ట్రంప్ ప్రభుత్వం సూచించింది. అధ్యాపక బృందాన్ని తనిఖీ చేయాలని కూడా చెప్పింది.




మీకోసం

ఎంతకడిగినా వాటర్ బాటిళ్లు వాసన వస్తుంటే కొంచెం టూత్ పేస్ట్ తీసుకుని అందులో కాసిన్ని నీళ్లు పోసి, ఆ మిశ్రమంతో బాటిల్ లోపల, బయట కడగాలి.

జీవన సౌరభం

మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించాలి. బలహీనపరిచే ప్రతి ఆలోచనను తిరస్కరించాలి.

తూనీగ సాయం!



ఓ చిన్న పూలతోటలో ఒక సీతాకోక చిలుక వచ్చి పూవు మీద వాలింది. దానికి కాస్త పక్కగా ఓ తూనీగ కూడా వాలింది. దానివైపు కాస్త చిరాకుగా ముఖంపెట్టి, 'ఏంటి నా పక్కనే వాలాలనిపించిందా? అటు పక్కగా బోలెడు పూల మొక్కలు ఉన్నాయి కదా?' అని అంది సీతాకోకచిలుక. తూనీగ ఏమీ అనకుండా అక్కడ నుండి ఎగిరిపోయింది.

ఒక రోజు ఆ సీతాకోకచిలుక పూల మీద వాలుతూ కొమ్మలకున్న సాలెగూడులో చిక్కుకుంది. బయటకు రావడానికి ఎంతో ప్రయత్నించింది. కానీ ఫలితం లేకపోయింది. సీతాకోకచిలుక గూడులో చిక్కుకున్నది ఆ తూనీగ చూసింది. వెంటనే తేనెటీగ వద్దకు వెళ్లింది. 'మిత్రమా! అటు పక్కగా సీతాకోకచిలుక సాలెగూడులో చిక్కుకుంది. నీ సాయం కావాలి' అని అడిగింది.

'పద..ఎక్కడుందో చూపించు' అంది తేనెటీగ. రెండూ సీతాకోక చిలుక ఉన్న చోటుకు వచ్చాయి. తేనెటీగ ఆ సాలెగూడును చిందరవందర చేసి సీతాకోకచిలుకను గూడు నుండి బయటపడేలా చేసింది. 'ధన్యవాదాలు మిత్రమా!' అంది సీతాకోకచిలుక. 'ఇందులో నేను చేసిందేమీ లేదు. నువ్వు ఆపదలో ఉన్నావని ఈ తూనీగ చెప్పింది. చాలా కంగారుగా నా దగ్గరికి వచ్చి నీకు సాయం చేయమని అడిగింది' అంది తేనెటీగ.

సీతాకోకచిలుక తూనీగను చూసి తల దించుకుంది. 'నన్ను క్షమించు మిత్రమా! నీకంటే నేను అందంగా ఉన్నానని గర్వపడి ఆరోజు నా పక్కన వాలొద్దు అన్నాను. అదేమీ నువ్వు మనసులో పెట్టుకోకుండా ఆపదలో ఉన్న నన్ను కాపడేలా చేశావు. నీకు కృతజ్ఞతలు' అని అంది. సీతాకోకచిలుకలో వచ్చిన మార్పుకు తేనెటీగ సంబరపడింది. 'హమ్మయ్య! మీ మధ్య స్నేహం కుదిరింది. నేను ఇక వెళ్లివస్తాను నేస్తాలు' అని రివ్వున ఎగిరిపోయింది. 'అలాగే నేస్తం!' అన్నాయి తూనీగ, సీతాకోకచిలుక.

– యు.విజయశేఖర రెడ్డి,
హైదరాబాద్.

నేను గీసిన బొమ్మ





ఎస్. శ్రీనిధి,
7వ తరగతి,
కె జి బి వి మక్లూర్,
నిజామాబాద్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఉద్ధృతంగా వెనక్కి...

సమాజం అభివృద్ధి చెందే క్రమంలో ఎన్నో ఆచార వ్యవహారాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఆచరణలో నిలవని ఆ 'తంతు'లన్నీ ఎప్పటి నుండో కనిపించకుండా పోయాయి. కొన్ని సమాజాల్లో తూతూ మంత్రంగా సాగుతూ, ఎప్పుడో ఒకప్పుడు అవి కూడా కనుమరుగయ్యే దశలో ఉన్నాయి. అలాంటి ఈ కాలంలో పశ్చిమ బెంగాల్‌లోని ఓ గిరిజన తెగ 250 ఏళ్ల క్రితం ఆచరించిన ఓ అనాగరిక వ్యవహారాన్ని పాలకులు నెత్తికెత్తుకున్నారు. మేమంటే మేము గొప్పగా జరిపిస్తామంటూ పోటీలు పడి మరీ దాన్ని నడిపిస్తున్నారు. సమాజాన్ని అభివృద్ధి పరచడంలో ఏమాత్రం చిత్తశుద్ధి లేని వారు సమాజాన్ని వెనక్కి నెట్టేసే పాఠ్యాంశాలతో దర్జాగా అక్కడ ఓ స్కూలు కూడా నడిపిస్తున్నారు.



ఈ నెలలో నిర్వహించిన 'బ్రాహ్మణ్ బంధన్' కార్యక్రమం

పశ్చిమ బెంగాల్ కుర్మసాల్‌లో నిర్దాణంగా సాగే 'బ్రాహ్మణ్ బంధన్' అనే ఓ ఆచారం, ఇప్పుడు స్థానిక పండుగల్లో భాగంగా నిర్వహిస్తున్నారు. పురులియా నుండి మన్బజార్‌కి మూడు గంటల బస్సు ప్రయాణం చేస్తే కుర్మసాల్ గ్రామం చేరుకుంటారు. అక్కడ 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారిలో 35 ముస్లిం కుటుంబాలు ఉన్నాయి. అక్కడ నిర్వహించే ఈ ఆచారం ఏడాదికేడాది కొత్త రూపాలు సంతరించుకోవడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఎప్పటి నుండి అంటే ...

2015 నుండి ఇది మొదలైంది. ఆచారం గురించి తెలుసుకునేముందు, ఈ గ్రామ వాస్తవ పరిస్థితిని పరిశీలించాలి. లెఫ్ట్‌ఫ్రంట్ కాలం నాటి ఏకైక ప్రాథమిక పాఠశాల ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంటోంది. ఉన్నతపాఠశాల, ఆరోగ్య కేంద్రం, బస్సు కనెక్టివిటీ లేక గ్రామ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రవాణా కోసం గ్రామస్తులు రెండు కిలోమీటర్లు నడవాలి. వర్షపు నీరే వారికి జీవనాధారం. ఈ కరువు ప్రాంతంలో తిండిగింజలు, కూరగాయ పంటలు ఎప్పుడూ ఎండిపోయే వుంటాయి.

తరతరాలుగా ఈ గ్రామంలోని హిందూ, ముస్లింలు నీరు, పండుగలు, కష్టాలు కలిసి పంచుకున్నారు. కానీ ఇప్పుడు అక్కడ ఏదో భిన్నంగా కనిపిస్తోంది. ఇంతకు ముందు ఎప్పుడూ లేని ఏదో తెలియని ఉద్రిక్తత ఆ ప్రాంతంలో నిద్రాణ స్థితి నుండి మేల్కొంటోంది. గిరిజన జనాభాలో ఒకప్పుడు ఆచరించే ఈ నిద్రాణమైన ఆచారం దశాబ్దకాలంలో కొత్త పుంతలు తొక్కింది. కులతత్వ ధోరణిని పెంచేలా రాజకీయ జోక్యం పెరిగింది.

బెంగాలీ సంవత్సరం చివరి రోజు అయిన చైత్ర సంక్రాంతి నాడు కూర్మసోల్, పొరుగు గ్రామాల బ్రాహ్మణేతరులు సాష్టాంగ నమస్కారాలు చేస్తూ బ్రాహ్మణ పూజారికి మార్గంలా కాళ్లు, చేతులు వెనక్కి వంచి భూమిపై ఆనించి సిద్ధంగా ఉంటారు. వారిపై అంటే కింద ఉన్న మనుషుల గుండెలపై కాలు, నేలని తాకకుండా పూజారి నడుచుకుంటూ వెళతాడు. ఆ పాద స్పర్శ కోసం పసిపిల్లలను ఆ దారిలో పడుకోబెట్టడం కూడా చేస్తారు. ఈ మొత్తం తంతు సుమారు గంటపాటు జరుగుతుంది. ఇలా చేస్తే రాబోయే కొత్త సంవత్సరమంతా వారికి మంచే జరుగుతుందని గ్రామస్తులు నమ్ముతారు.

వారం క్రితం ఈ తంతు ఎలా జరిగిందంటే..

ఈ ఏడాది ఏప్రిల్ 14న జరిగిన ఈ ఆచారాన్ని చూసేందుకు, పాల్గొనేందుకు 18 గ్రామాల ప్రజలు హాజరయ్యారు. పూజారి నడిచేందుకు 200 మంది గిరిజనులు చెరువులో స్నానం చేసి కొత్త దుస్తులు ధరించి, తమ శరీరాలతో మార్గాన్ని సిద్ధం చేశారు. చెరువులో స్నానం చేసి వచ్చిన పూజారి, వారిపై నడుస్తున్నప్పుడు చుట్టూ ఉన్న జనం వెర్రిగా కేకలు వేశారు. చప్పట్లు కొట్టారు. అయితే ఈ ఆచారంలో పాల్గొన్న యువకుల్లో కొంతమంది దీనిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

'ఎప్పుడో తాతముత్తాతల కాలం నాటి ఈ ఆచారం ఇప్పుడు కూడా పాటించడం ఏంటి? ఒకవేళ మేము దీన్ని వ్యతిరేకించి పాల్గొనకపోతే సమాజం నుండి మమ్మల్ని దూరం పెడతారు. కాబట్టి ఇష్టం లేకపోయినా ఇందులో పాల్గొనాల్సి వస్తోంది' అని పూజారి నడిచేందుకు సిద్ధమైన కొంతమంది యువకులు చెప్పారు.

రాజకీయ జోక్యం

ఈ మొత్తం తంతు ఇప్పుడు రెండు వర్గాలుగా చీలిపోయింది. ఒకదాన్ని 0తృణమూల్ కాంగ్రెస్, రెండోదాన్ని బిజెపి నిర్వహిస్తున్నాయి. 250 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ క్రతువులో మహిళల సంఖ్య అంతంతమాత్రంగానే కనిపిస్తున్నా పురుషుల్లో మాత్రం ఇదొక క్రేజ్‌లా మారిపోయింది. ప్రతి కుటుంబం నుండి ఒకరు తప్పనిసరిగా ఇందులో పాల్గొంటున్నారు.

2017 నుండి బిజెపి ఈ ఉత్సవంలోకి ప్రవేశించింది. అప్పటి నుండే ఇక్కడ ఘర్షణలు జరగడం మొదలైంది. ఉత్సవం కూడా రెండుగా చీలిపోయింది. అయితే దీన్ని నిస్సిగ్గుగా సమర్థించుకునే బిజెపి పెద్దలు ఏమన్నారంటే, 'మేము సనాతన విలువలను కాపాడుతున్నాం. సమాజ శ్రేయస్సు కోసం ఈ సంప్రదాయాన్ని చేస్తున్నాం. సనాతన విశ్వాసులకు ఈ మతపరమైన ఆచారాన్ని అనుసరించమని ప్రోత్సహిస్తున్నాం' అని బిజెపి తరపున జాతర నిర్వహించే ఓ విశ్వాసకుడు ఎంతో బలంగా తన ధోరణిని చెప్పాడు.

ఆర్‌ఎస్‌ఎస్ పాఠాలతో స్కూలు

అనాదిగా నిమ్నవర్గాలను అణిచివేసే ఈ బ్రాహ్మణ ఆధిపత్య ధోరణిని ఇంత పెద్దఎత్తున విస్తరించడం వెనుక ఆధ్యాత్మిక గురువు స్వామి జపానంద స్థాపించిన కూర్మసోల్ శారద విద్యాపీఠ్ పాఠశాల ప్రభావం కూడా ఉంది. ఈ పాఠశాలలో ఆర్‌ఎస్‌ఎస్ రూపొందించిన పాఠ్యాంశాలు బోధిస్తారు. గ్రామంలో ఉన్న ఏకైక ప్రభుత్వ బడి మూతబడడంతో గ్రామస్తులు ఈ స్కూలుకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు.

స్కూలు నిర్వహణపై గ్రామంలోని ఓ యువకుడు మాట్లాడుతూ, 'శారదా పీఠాన్ని పిల్లల బ్రెయిన్ వాష్ చేసే కేంద్రంగా వినియోగిస్తున్నారు. దళితులను బ్రాహ్మణుల కాళ్లకింద ఉంచే వ్యవస్థగా చిత్రీకరిస్తున్నారు. ఇది ఒక్క కూర్మసోల్‌లోనే కాదు, చుట్టుపక్కల గ్రామాలకు కూడా వ్యాపించింది. శారదాపీఠాన్ని అన్ని గ్రామాల్లో ఏర్పాటుచేస్తున్నారు. నెమ్మదిగా బిజెపి తన స్థావరాన్ని ఇక్కడ పదిల పర్చుకుంటోంది. ఆ మాయలో గ్రామంలోని యువత పడిపోతున్నారు. నేను మాత్రం దాన్ని నుండి జాగ్రత్త పడుతున్నాను' అని కాంతిప్రసాద్ అనే ఓ యువకుడు ఎంతో ఆవేశంగా చెప్పాడు.



ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాల ప్రచార బోర్డు

ఒకప్పుడు చాలా మామూలుగా ...

ఈ క్రతువును తరతరాలుగా చూస్తున్న గ్రామపెద్ద కూడా దీనిపై అసహనం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ 'ఈ సాంప్రదాయం చాలా పాతది. నా బాల్యంలో ఇది చాలా మామూలుగా కనిపించేది. కానీ ఇప్పుడు మాత్రం ఆర్భాటాలు, డప్పులు, లైట్లు, ఖర్చు కనిపిస్తున్నాయి. దీనివెనుక ఏవో అదృశ్య చేతులు ఉన్నాయి. అవే ఈ మొత్తం వ్యవహారానికి నిధులు సమకూరుస్తున్నాయి. ఈ ధోరణి ఎంతలా వ్యాపించిందంటే, గ్రామస్తులు తమ పిల్లలకు కుల క్రమానుగతాన్ని గౌరవించమని చెబుతున్నారు. నిమ్న కులాలను తక్కువగా చూడాలని, బ్రాహ్మణులని అధికంగా భావించాలని నేర్పుతున్నారు. ఈ 'బ్రాహ్మణ బంధన' కార్యక్రమంలో పాల్గొనకపోతే దైవిక శిక్ష గురించి హెచ్చరిస్తున్నారు. దురదృష్టం వెంటాడుతుందని భయపెడుతున్నారు. ఈ పరిస్థితి ఎక్కడికి దారితీస్తుందో' అంటూ గ్రామ పెద్ద అమూల్య మండల్ ఆవేదన చెందుతున్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎర్ర జెండానే ప్రత్యామ్నాయం

- లెనిన్ జయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సామ్రాజ్యవాదం ముసుగులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తన గుప్పెట్లో పెట్టుకునేందుకు అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రయత్నిస్తున్నారని, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎర్ర జెండా మాత్రమే ప్రత్యామ్నాయమని పలువురు వక్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపకులు విఐ లెనిన్ 155వ జయంతి సందర్భంగా మార్క్స్, ఏంగిల్స్, లెనిన్ విగ్రహ కమిటీ ఆధ్వర్యాన నగరంలోని లెనిన్ విగ్రహం వద్ద మంగళవారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. సోవియట్ దేశంలో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటం చేసి విజయం సాధించి సుదీర్ఘకాలం ఎర్ర జెండా పరిపాలన కొనసాగిందని చెప్పారు. మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో లేకపోవచ్చు, కానీ భవిష్యత్తులో మాత్రం ఎర్ర జెండాదేని ఆశాభావం వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. ప్రతి ఏడాదికి ఒక ప్రత్యేకత ఉన్నట్లే ఈసారి ట్రంప్ సాగిస్తున్న ఆర్థిక అరాచకాల వల్ల దేశం ఉత్పత్తి చేస్తున్న రొయ్యలు, ఎండుమిర్చి వంటి అనేక ఉత్పత్తులకు సరైన ధరలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే దేశంలో ప్రజలు రోడ్కెక్కి ఉద్యమిస్తున్నారని తెలిపారు. మన దేశంలో గడిచిన 11 ఏళ్లలో కార్పొరేట్‌లకు తప్ప సాధారణ ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సిపిఐ (న్యూ డెమొక్రసీ) పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి ప్రసాద్ మాట్లాడుతూ.. మార్క్స్ సిద్ధాంతాలు, లెనిన్ పోరాటాల స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణ, పాపులర్ సంస్థ అధినేత చుక్కపల్లి విజయ్‌కుమార్, రిటైర్డు ప్రొఫెసర్ సి నరసింహారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, సిపిఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, ప్రజానాట్యమండలి నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



లెనిన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబూరావు తదితరులు



'తుడురమ్' తెలుగు ట్రైలర్ విడుదల


మోహన్ లాల్, శోభన జంటగా 'తుడరుమ్' అనే చిత్రం తెరకెక్కింది. తాజాగా ఈ చిత్రం నుండి తెలుగులో ట్రైలర్ విడుదల చేశారు. తరుణ్ మూర్తి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రెజపుత్ర విజువల్ మీడియా బ్యానర్‌పై ఎం.రెంజిత్ నిర్మిస్తున్నారు. ఈ నెల 25న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



'రావు బహదూర్' సత్యదేవ్

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమామహేశ్వర ఉగ్రరూపశ్య' సినిమాతో ఆకట్టుకొన్న దర్శకుడు వెంకటేష్ మహాతో సత్యదేవ్ ఓ చిత్రం చేస్తున్నారు. తాజాగా మూవీ టీం ఈ ప్రాజెక్ట్‌కి 'రావు బహదూర్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. దాదాపు రూ.25 కోట్లతో ఈ సినిమాని రూపొందిస్తున్నారు. సాంకేతిక వర్గం, ఇతర నటీనటుల వివరాలు త్వరలో తెలియనున్నాయి.

జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం



గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం జూన్ 14న జరగ బోతోంది. ఈ విషయాన్ని నిర్మాత, రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్.డి.సి) దిల్ రాజు తెలిపారు. హెచ్ ఐసీసీ వేదికగా ఈ అవార్డులు ప్రదానం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డ్స్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో దిల్‌రాజు ఈ ప్రకటన చేశారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం ఇస్తున్న ఈ పురస్కారాల ఎంపిక కోసం నిష్ణాతులతో కూడిన జ్యూరీని నియమించినట్లు ఇటీవల దిల్‌రాజు వెల్లడించారు. జ్యూరీ ఛైర్మన్, ప్రముఖ నటి జయసుధ అధ్యక్షతన గత బుధవారం (ఏప్రిల్ 17) గద్దర్ అవార్డ్స్ జ్యూరీ సమావేశం జరిగింది. నామినేషన్ల స్క్రీనింగ్ ప్రక్రియ గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'ఉమ్మడి రాష్ట్రంలో కూడా రానంత స్పందన గద్దర్ చలన చిత్ర పురస్కారాలకి వచ్చింది. అన్ని కేటగిరీలకి కలిపి 1248 నామినేషన్లు అందాయి. తెలుగు చలన చిత్ర రంగానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించేలా పురస్కారాల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది' అన్నారు. 14 ఏళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాలు ఇవని, నామినేషన్లని నిష్పక్షపాతంగా పరిశీలించాలని జ్యూరీ సభ్యుల్ని ఆయన కోరారు. జ్యూరీ ఛైర్మన్ జయసుధ మాట్లాడుతూ 'ప్రభుత్వం అప్పగించిన బాధ్యతని సవాల్‌గా తీసుకుని ఎంపిక ప్రక్రియని పూర్తి చేస్తాం. పురస్కారాల కోసం వ్యక్తిగత విభాగంలో 1172 నామినేషన్లు, ఫీచర్ ఫిల్మ్, బాలల చిత్రాలు, పరిచయ చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలతోపాటు ఇతర విభాగాలు కలిపి 76 దరఖాస్తులు వచ్చాయి' అని వెల్లడించారు.

లక్నోకు ముకేశ్ చెక్

- అభిషేక్ పోరెల్, కెఎల్ రాహుల్ అర్ధసెంచరీలు
- ఎనిమిది వికెట్ల తేడాతో ఢిల్లీ గెలుపు



లక్నో: ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ ముఖేష్ కుమార్ సంచలన బౌలింగ్‌తో చెలరేగి లక్నో సూపర్‌జెయింట్స్‌ను కట్టడి చేశాడు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 159పరుగుల నామమాత్రపు స్కోర్‌కే పరిమితమైంది. ఆ లక్ష్యాన్ని ఢిల్లీ జట్టు 17.5ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ అభిషేక్ పోరెల్(51), కెప్టెన్ కెఎల్ రాహుల్(57నాటౌట్), అక్షర్ పటేల్(34నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు. లక్నో బౌలర్ మార్క్రమ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు లక్నో సూపర్ జెయింట్స్ ఓపెనర్లు అదిరే ఆరంభాన్నిచ్చినా.. మంగళవారం జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో లక్నో నామమాత్రపు స్కోర్‌కే పరిమితమైంది. ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్(52) అర్ధ సెంచరీకి తోడు.. మిచెల్ మార్ష్(45) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 87పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. పవర్ ప్లే తర్వాత పుంజుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్లు లక్నోను కట్టడి చేశారు. ముకేశ్ కుమార్(4/33) ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి లక్నోను దెబ్బకొట్టాడు. అయితే.. ఇంప్యాక్ట్ ప్లేయర్ ఆయుష్ బడోని(36), డేవిడ్ మిల్లర్(14 నాటౌట్)లు డెత్ ఓవర్లలో దూకుడుగా ఆడారు. ముకేశ్ వేసిన 20వ ఓవర్లో బడోని వరుసగా మూడు ఫోర్లు కొట్టి స్కోర్‌బోర్డును పరుగెత్తించాడు. ఆ తర్వాత మూడు బంతులకు బడోని, పంత్‌ను ముఖేష్ కుమార్ ఔట్ చేశాడు.

సొంతగడ్డపై లక్నోసూపర్ జెయింట్స్ శుభారంభాన్ని సద్వినియోగం చేసకోలేకపోయింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు మర్క్‌రమ్-మిచెల్ మార్ష్‌లు చెలరేగి ఆడారు. ముకేశ్, స్టార్క్ బౌలింగ్‌లో బౌండరీలతో విరుచుకు పడ్డారు. వీళ్లిద్దరి జోరుతో పవర్ ప్లేలో వికెట్ కోల్పోకుండా 51 పరుగులు వచ్చాయి. లక్నో. 30 బంతుల్లోనే అర్ధ సెంచరీ కొట్టిన మర్క్‌రమ్ జోరు పెంచే క్రమంలో చమీర బౌలింగ్‌లో ఔటయ్యాడు. స్టబ్స్ స్టన్నింగ్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. 87 వద్ద తొలి వికెట్ కోల్పోయిన లక్నోకు స్టార్క్ డేంజరస్ నికోలస్ పూరన్(9)ను వెనక్కి పంపి మరో షాకిచ్చాడు. ముకేశ్ ఇక తనవంతు అన్నట్లు ఒకే ఓవర్లో అబ్దుల్ సమద్(2), మార్ష్‌ను ఔట్ చేసి లక్నోను దెబ్బతీశాడు. ఆ తర్వాత ఇంప్యాక్ట్ ప్లేయర్గా వచ్చిన ఆయుష్ బడోని, డేవిడ్ మిల్లర్‌లు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. డెత్ ఓవర్లలో ధాటిగా ఆడి స్కోర్ 150 దాటించారు.

స్కోర్‌బోర్డు...

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మార్క్రమ్ (సి)స్టబ్స్ (బి)ఛమీర 52, మిఛెల్ మార్ష్ (బి)ముఖేష్ కుమార్ 45, పూరన్ (బి)స్టార్క్ 9, అబ్దుల్ సమద్ (సి అండ్ బి)ముఖేష్ కుమార్ 2, డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 14, ఆయుష్ బడోనీ (బి)ముఖేష్ కుమార్ 36, పంత్ (బి)ముఖేష్ కుమార్ 0, అదనం 1. (20ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 159పరుగులు.

వికెట్ల పతనం: 1/87, 2/99, 3/107, 4/110, 5/159, 6/159

బౌలింగ్: అక్షర్ పటేల్ 4-0-29-0, స్టార్క్ 4-0-29-1, ముఖేష్ కుమార్ 4-0-33-4,

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: అభిషేక్ పోరెల్ (సి)డేవిడ్ మిల్లర్ (బి)మార్క్రమ్ 51, కరణ్ నాయర్ (బి)మార్క్రమ్ 15, కెఎల్ రాహుల్ (నాటౌట్) 57, అక్షర్ పటేల్ (నాటౌట్) 34), అదనం 4. (17.5ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 161పరుగులు.

వికెట్ల పతనం: 1/36, 2/105

బౌలింగ్: శార్దూల్ ఠాకూర్ 2-0-28-0, దిగ్వేష్ సింగ్ రాథి 4-0-24-0, ప్రిన్స్ యాదవ్ 2.5-0-23-0, మార్క్రమ్ 3-0-30-2, ఆవేశ్ ఖాన్ 3-0-19-0, రవి బిష్ణోయ్ 3-0-36-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	8	6	2	12	+1.10
ఢిల్లీ	8	6	2	12	+0.65
బెంగళూరు	8	5	3	10	+0.47
పంజాబ్	8	5	3	10	+0.17
లక్నో	9	5	4	8	-0.05
ముంబయి	8	4	4	8	+0.48
కోల్‌కతా	8	3	5	6	+0.21
రాజస్తాన్	8	2	6	4	-0.63
సన్‌రైజర్స్	7	2	5	4	-1.21
చెన్నై	8	2	6	4	-1.39

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు

సన్‌రైజర్స్ హైదరాబాద్ x ముంబయి ఇండియన్స్
వేదిక: హైదరాబాద్; రాత్రి 7.30గంllలకు

సిమ్రన్‌ప్రీత్‌కు రజతం

- ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్



లిమా(పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ స్టేజ్-2 టోర్నమెంట్లో భారత్‌కు మరో పతకం దక్కింది. మహిళల 25మీ. పిస్టల్ విభాగంలో సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ రజతంతో మెరిసింది. ఫైనల్లో ఆమె 33 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. సన్ యుజీ (చైనా, 34) ఒక్క పాయింట్ తేడాతో స్వర్ణాన్ని గెలుచుకుంది. మరో చైనా షూటర్ యావో కియాన్‌గ్జున్ (29) కాంస్యం దక్కించుకుంది. స్టార్ షూటర్ మను బాకర్‌కు నిరాశ ఎదురైంది. క్వాలిఫయింగ్‌లో రెండో స్థానంలో నిలిచిన మను (585).. ఫైనల్లో 22 పాయింట్లే స్కోరు చేసి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఇషా సింగ్ (575) క్వాలిఫయింగ్‌లో వెనుదిరిగింది. పంజాబ్‌కు చెందిన 20ఏళ్ల సిమ్రన్‌కు సీనియర్ విభాగంలో ఇదే తొలి పతకం.

నజ్ముల్ అర్ధసెంచరీ

బంగ్లాదేశ్ 194/4..జింబాబ్వేతో తొలిటెస్ట్

షెల్హాట్(బంగ్లాదేశ్): బంగ్లాదేశ్-జింబాబ్వే జట్ల మధ్య జరుగుతున్న తొలిటెస్ట్ హోరాహోరీగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ 191పరుగులకే ఆలౌట్ కాగా.. రెండోరోజు జింబాబ్వే జట్టు 273పరుగులకే కుప్పకూలింది. మూడోరోజైన మంగళవారం బంగ్లాదేశ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 4వికెట్ల నష్టానికి 194పరుగులు చేసింది. నజ్ముల్ హొస్సైన్(60) అర్ధసెంచరీకి తోడు జాకెర్ అలీ(21) క్రీజ్‌లో ఉన్నారు. మూడోరోజు ఆటలో భాగంగా బంగ్లాదేశ్ ఓపెనర్ షాద్మన్ అస్లామ్(4) నిరాశపరిచినా.. హసన్ జో(33) బ్యాటింగ్‌లో రాణించాడు. మోమినుల్ హక్(47) తృటిలో అర్ధసెంచరీని మిస్ చేసుకోగా.. నజ్ముల్ అర్ధసెంచరీతో రాణించాడు. బంగ్లాదేశ్ జట్టు ఇప్పటివరకు 112పరుగుల ఆధిక్యతను సంపాదించింది. జింబాబ్వే బౌలర్లు ముజరబ్బానికి మూడు, విక్టర్ నౌచికి ఒక వికెట్ దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68